సంపుటి 13 సంచిక 1 జనవరి - ఫిబ్రవరి 2025

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-13 Issue-1
వెల : రూ. 20/-







# హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

## 2025 జనవరి, 24-26




**Brigadier Sri Ganesham Garu at Hyderabad Literary Festival, Knowledge City, Hyderabad on 24-01-2025**













సంపుటి-13 సంచిక - 1 జనవరి - ఫిబ్రవరి 2025

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 200/-**
**for 1 year Subscription**

## ఈ సంచికలో.....


* రైతులకు ఖర్చు లేకుండా పంటకు నీరు - కాసోజు శివశంకర్ తయారు చేసిన 'న్యాచురల్ వాటర్ పంప్' - 4
* అలుపెరుగని ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' గ్రహీత చింతకింది మల్లేశం - 6
* 'సేంద్రియ వ్యవసాయం' చేయాలనుకున్న రైతులకు రైతు ఇన్నోవేటర్ల సూచనలు - 10
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 12
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 14
* యువత అవగాహనకై ప్రకృతిలో లభించే చెట్ల పేర్లు సంస్కృతం మరియు తెలుగు భాషల్లో - 18
* '49వ జాతీయ శోధయాత్ర - తూర్పు ఉత్తర ప్రదేశ్ నుంచి అసాధారణ సందేశం - 2వ భాగం - 20
* 'అడవి పుత్రుడు' కొమెర జాజితో అడుగులు వేస్తూ..... నల్లమల అడవిలో ఒకరోజు - 22
* పల్లె జ్ఞానం - 23
* పూల వ్యాపారులకు వరం 'పూలదండలు కుట్టే యంత్రం' శ్యాంబాబు వినూత్న సృజన - 25
* ఎన్ఐఎఫ్ వారి 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్-2023) పురస్కారాలు - 28
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32


**కవర్ లోపలి పేజీల్లో ...**
"హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్"
అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు
**మధ్య పేజీలో :**
జనవరి - ఫిబ్రవరి, 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# సేంద్రియ వ్యవసాయం దిశ ఏమిటి?

భారత ప్రభుత్వం సహజ వ్యవసాయాన్ని మరియు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఎన్నో చట్టాలు, మార్గదర్శకాలు, సంస్థలు, తగిన ఆర్థిక మద్దతు, కేంద్ర రాష్ట్రాల బాధ్యతలు అన్నీ చక్కగా గత పదేళ్లలో రూపొందించింది. కాలానుగుణంగా కావలసిన మార్పులను కూడా సరిగ్గా చేస్తూ ఉంది. మనం సేంద్రియ వ్యవసాయం గురించి ఈ సంపాదకీయంలో చర్చించకుందాం.

అనాదిగా భారత దేశంలో సాగుతూ వస్తున్న వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ సుస్థిర వ్యవసాయ దిగుబడులను సాధించటం, వాతావరణానికి అనుకూలంగా, కాలుష్య రహితంగా చేసే వ్యవసాయాన్ని భారత ప్రభుత్వం "సేంద్రియ వ్యవసాయం"గా నిర్వచించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం 140 మిలియన్ హెక్టార్ల సాగుభూమి ఉండగా రెండు శాతం అంటే 2.8 మిలియన్ హెక్టార్లు మాత్రమే సేంద్రియ వ్యవసాయ పరిధిలో ఉంది. ఇందులో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల వంతు 50% విస్తీర్ణం. తెలుగు రాష్ట్రాల్లో సేంద్రియ వ్యవసాయం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. రైతులు సులువుగా సేంద్రియ వ్యవసాయానికి మారలేక పోతున్నారు. తగినంత సమాచారం, శిక్షణ, స్థానిక మార్గదర్శకత్వం, పైలట్ ప్రాజెక్టులు, ప్రతి గ్రామంలో చేయడం, దానికి తగిన బడ్జెట్ కేటాయించడం, మిషన్ మోడ్‌లో సేంద్రియ వ్యవసాయాన్ని విస్తరించడం.... ఇవన్నీ సరియైన సమన్వయంతో జరిగితేనే సేంద్రియ వ్యవసాయాన్ని రైతులు చేపట్ట గల్గుతారు.

సహజ వ్యవసాయానికి, సేంద్రియ వ్యవసాయానికి ఉన్న తేడాలు రైతులకు క్షుణ్ణంగా అర్థం కాలేదు. సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వాలు అందుబాటులో ఉంచిన పథకాలు, సబ్సిడీలు వగైరాల వివరాలు కరపత్రాల ద్వారా, అవగాహన సదస్సుల ద్వారా ముమ్మరం చేయాల్సి ఉంది.

అన్నిటికంటె రైతును సేంద్రియ వ్యవసాయం నుండి వెనక్కు లాగే అంశం... దిగుబడి తగ్గుతుందన్న భయం. దీనికి వ్యవస్థలో ఎవరూ బాధ్యత వహించరు. పద్ధతిగా రైతుకు వచ్చే మామూలు ఆదాయం ఆయనకు వచ్చేట్టు దానికి కావలసిన భరోసా డబ్బు రూపంలో కాని, ధాన్య రూపంలో కాని ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావాలి. మిషన్ పద్ధతిలో కొన్ని గ్రామాలను ఎంచుకుని, అయిదేళ్లలో వాటిని పూర్తిగా సేంద్రియ వ్యవసాయ గ్రామాలుగా మార్చడానికి ప్రభుత్వం దిట్టమైన మోడల్స్‌ను ప్రవేశ పెట్టాలి. వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులను ఈ ప్రాజెక్టులలో ఉపయోగించాలి. సేంద్రియ వ్యవసాయమే దేశ వ్యవసాయరంగ భవిష్యత్తు అని నమ్మితే పైన వివరించిన పథకాలకు మరిన్ని జోడించి ప్రభుత్వాలు ముందుకు రావాలి.

వ్యవసాయ విధానంలో మార్పు వ్యక్తిగత రైతుల్లో మార్పు కాకుండా వ్యవసాయ కమ్యూనిటీల్లో సమిష్టి మార్పుకై ముందడుగు వేయాలి. క్లస్టర్లు, చిన్న చిన్న గ్రామాలను సంపూర్తిగా మార్చడానికి ప్లాను వెయ్యాలి. ఒకరికొకరు తోడు ఉంటారు కాబట్టి సమిష్టిగా ప్రయోగాత్మక వ్యవసాయం చేయడానికి రైతు సమూహాలు సన్నద్ధమవుతారు. ఖర్చులు, కష్ట నష్టాలు సమంగా పంచుకొనే అవకాశం ఈ పద్ధతిలో ఉండటం వలన వ్యక్తిగతంగా రైతులు నష్టపోతామన్న భయం నుండి బయటపడతారు. అంతే కాకుండా ఈ పద్ధతిలో సహకారంతో సమిష్టి ఖర్చులు కూడా తగ్గే అవకాశముంది.

ప్రస్తుత వ్యవసాయ పరిశోధనలు, సలహాలు, ప్రభుత్వ విధానాలు పంటపరంగా లేవు. వాణిజ్య పరంగా పంట దృష్ట్యా పద్ధతులను అమలు చేస్తున్నారు కాని, వ్యవసాయం చేయటంలో పంట పరంగా ఏ



నమూనాలు లేవు. ప్రతి పంటకు - దుక్కి దున్నడం నుండి కోత వరకు ఒక కిట్ తయారు చేసి, సేంద్రియ రైతులకు అందజేయాలి. ఆ కిట్‌లో పెట్టుబడి తగ్గేట్టు, సేంద్రియ వ్యవసాయానికి సరిపడేట్టు పరికరాలు మందులు, ఎరువులు (రసాయనం కాదు). మెషీన్లు 50-100 ఎకరాల క్లస్టర్‌కు సరిపడేట్టుగా ఉండాలి. ఈ కిట్లను తక్కువ ఖర్చుతో లభించేట్టుగా చేయగలిగితే రైతు సమూహాలు సులభంగా కొనటానికి ముందుకొస్తాయి. ఈ కిట్లు రైతుల మెజారిటీ ప్రశ్నలకు జవాబులివ్వాలి. దానికి తగిన శిక్షణ అవగాహన, ఊర్లోని ఉత్తేజంగా ఉన్న రైతులకు ఇవ్వాలి. సాధ్యమైనంత వరకు రైతుకు వెనక్కు తిరిగి ప్రశ్నలడిగేలా ఉండకూడదు. ముందుకు సాగిపోయేట్టుగా, ఉత్సాహంతో ప్రయోగం చేస్తూ విజయం సాధించాలన్న తపనతో, విశ్వాసంతో గమ్యాన్ని చేరుకునేట్టుగా ఈ కిట్ డిజైన్ చెయ్యాలి.

ఈ సందర్భంలో పల్లెసృజన తయారు చేసిన "పల్లెసృజన మిరప కిట్" గురించి నవంబరు-డిశంబర్ 2024 పత్రికలో వివరంగా ప్రచురించాము. ఈ కిట్‌లో ముఖ్యంగా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ల పరిష్కారాలను చేర్చాము. వాటి ఖర్చు తక్కువ, అవలీలగా వాడుకోవచ్చు, అందుబాటు ధరలో ఉంటుంది. కావలసొస్తే, చిన్న మార్పులు స్థానికంగా చేసుకోవచ్చు. పల్లెసృజన లెక్కప్రకారం ఈ మిరప కిట్ పెట్టుబడిని సగం తగ్గించేస్తుంది. కిట్ ఖర్చు ప్రథమ పంటలోనే తీరిపోతుంది. అన్నంత రాకపోయినా, పెట్టుబడి తగ్గడం మాత్రం ఖాయం. ఇలాంటి కిట్లను, పల్లెసృజన తెలుగు రాష్ట్రాల్లోని అయిదు ప్రధాన పంటలకు మే నెల చివరి వరకు తయారు చేసి, మీ అందరికీ తెలియజేస్తుంది. ఈ కిట్లను వాడటానికి రైతు సమూహాలు ముందుకు రావాలని, వాటిని ప్రయోగం చేసి రైతాంగానికి ఒక కొత్త వ్యవసాయ పథం వెలుగులోకి తీసుకు రావాలని తెలుగు రైతులను ఆహ్వానిస్తున్నాము, కోరుతున్నాము. వివరాలకు పల్లె వీరరాఘవ రెడ్డి (8125799904)తో సంప్రదించ గలరు.

సేంద్రియ వ్యవసాయ నిర్వచనంలో ప్రాచీన వ్యవసాయ పద్ధతుల పరిధిలో ఉండాలన్న నిబంధన కూడా ఉంది. ఇప్పుడు మనం వాడుతున్న వ్యవసాయ యంత్రాలు ట్రాక్టర్లు, వీడర్లు, స్ప్రేయర్లు, కోత మిషన్‌లు వగైరా సేంద్రియ వ్యవసాయానికి తోడు చేస్తాయా అన్న విషయంపై ప్రభుత్వం, వ్యవసాయ నిపుణులు నిర్ధారణ చేయవలసి ఉన్నది. నాగలితో దున్నడంతో సేంద్రియత అధికంగా ఉంటుంది. పశువులు, చెట్లు మనుషుల వినియోగం మన ప్రాచీన వ్యవసాయ పద్ధతి ఒక వేళ 20వ శతాబ్దంలో వచ్చిన ట్రాక్టర్ల లాంటి యాంత్రిక సహాయత సేంద్రియ వ్యవసాయానికి వర్తించక పోతే కొత్త యంత్రాలను, పద్ధతులను ప్రవేశ పెట్టాలి. వాటికి సరియైన పరిశోధన, అందుబాటులో ఉండేలాగా తయారు చేయించి, విస్తారంగా రైతు సమూహాలకు పంచాలి. ఈ విషయంలో ప్రభుత్వాలు, పరిశోధన సంస్థలు పెద్దయెత్తున ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినట్టుగా అవగతం కావటం లేదు.

అయితే గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు, చాలావరకు సేంద్రియ వ్యవసాయానికి దోహదం చేస్తాయి. పల్లెసృజన వెతికి వెలుగులోకి తెచ్చిన 200కు పైగా రైతుల కోసం రైతులు తయారు చేసిన పరిష్కారాలను సేంద్రియ వ్యవసాయ యంత్రాలు/ పరికరాలు కిట్‌లో చేర్చాలి. దీనికి పల్లెసృజన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ లభిస్తాయి.

సేంద్రియ వ్యవసాయంపై శ్రద్ధ వున్న రైతు సమూహాలు పల్లెసృజనతో చర్చలు జరిపితే అనువైన, అందుబాటులో వున్న, పెట్టుబడి తగ్గించే, రైతులకు లాభం కల్పించే పరికరాలను గురించి సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. రైతు సమూహాలకు పల్లెసృజన స్వాగతం.

ఎండాకాలం ప్రారంభమైంది. గ్రామాల్లో ప్రజలకు అడవుల్లోని వన్య ప్రాణులకు తగినంత తాగునీరు, నీడ లభ్యమవ్వాలని మనసారా కోరుతూ......

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

**"పల్లెసృజన విశ్వాసం"**

✤ రైతులు గ్రాహకులు కాదు ప్రొవైడర్స్ ✤ ఊళ్ళు అంతులేని బావులు కాదు - అవి సోర్స్

# రైతులకు ఖర్చు లేకుండా పంటకు నీరు

## కాసోజు శివశంకర్ తయారు చేసిన 'గ్రావిటీ వాటర్ పంప్'



- వీరరాఘవ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం లోని 'సంగెం' గ్రామానికి చెందిన "కాసోజు శివశంకర్" అనే యువకుడు వీరి తల్లి దండ్రులకు 4 గురు ఆడపిల్లల తర్వాత జన్మించిన శివ శంకర్ కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 'బయోటెక్నాలజీ' చదువు మధ్యలోనే ఆపివేశాడు. ఆ తర్వాత తన గ్రామంలోనే ఒక వెల్డింగ్ షాప్ ఏర్పాటు చేసుకుని ఆ ప్రాంత రైతులకు అవసరమైన పరికరాలు తయారు చేసి ఇవ్వటం, పాడైపోయిన పరికరాలను మరమ్మత్తు చేయటం తన వృత్తిగా ఎన్నుకుని అందరు రైతులకు అందుబాటులో ఉన్నాడు.

ఇతని వ్యాపారం ఇలా సాగుతున్న సమయంలో తన షాపుకు సమీపంలో గల ఇతని మిత్రుడు శ్రీనివాస రెడ్డి అనే రైతు తనకున్న పొలంలో ఒక చేనుకు నీరు అందించేందుకు పడుతున్న కష్టాలను గురించి శంకర్‌తో చర్చించాడు. తన పొలానికి నీరు పారించేందుకు ఆ ప్రాంతంలో కరెంటు సరఫరా లేదు కాబట్టి తాను మోటారు ఏర్పాటు చేసోకోలేడు. తన సమీపంలోని ఒక రైతు మోటారునుండి అవసరం అయినప్పుడల్లా అతని మోటారు ద్వారా నీరు పారించుకుంటూ తన పంటను బ్రతికించుకునే వాడు. ఈ సంవత్సరం ఆ రైతు పొలానికి నీరు పారించుకోవటం గగనమైపోవటంతో ఇతని పొలానికి నీరు ఇవ్వలేక పోయాడు. ఇటీవలే నాటిన వరి పంట ఎండిపోతోంది. ప్రక్కనే కాలువ ఉంది కాని, ప్రతిసారి డీజిల్ మోటారును కిరాయికి తెచ్చుకొని నీరు పారించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. దీనికి ఏదైనా పరిష్కారం చూపమని శంకర్‌ను అడిగాడు.

తను చదువుకున్న పరిజ్ఞానంతో తన మిత్రుడి పొలం ప్రక్కనే వున్న కాలువ నుండి 'గ్రావిటీ ద్వారా నీరు పారించవచ్చు' అని తనవద్ద వున్న పాత సామాన్లతో చేతితో తిప్పటం ద్వారా నీరు పారేలా ఒక పరికరం తయారు చేశాడు. కానీ, అది శివశంకర్‌కే అంతగా నచ్చలేదు. ఇలా చేతితో తిప్పుకుంటూ పొలానికి నీరు పారించాలంటే చాలా కష్టం అనిపించింది. దీన్ని ఇంకా ఎలా అభివృద్ధి చేసి చూడాలని ఆలోచించటం మొదలు పెట్టాడు.









రైతు శ్రీనివాస రెడ్డి పొలం ప్రక్కనే బాగా నీరు పారే కాలువ ఉంది. కాకపోతే ఆ కాలువ ఈ రైతు పొలం కన్నా 8 అడుగుల లోతులో ఉంటుంది. అంటే తాను చేసే పరికరం నీటిని 10 అడుగుల పైనుండి పారే విధంగా తయారు చేయాలి అనుకున్నాడు. కాలువలో నీటి ప్రవాహం కాస్త వేగంగానే ఉండటం గమనించాడు. ఈ పారే నీరు వేగం తోనే తిరిగేలా 10 అడుగుల వ్యాసం గల చక్రాన్ని ఏర్పాటు చేశాడు. ఈ చక్రాన్ని ఏర్పాటు చేయటం కోసం ఒక సైకిలు చక్రాన్ని తీసుకుని దానికి అనుసంధానిస్తూ మరో రెండు చక్రాలను వెల్డింగ్ సహాయంతో ఏర్పాటు చేసి మొత్తానికి 10 అడుగుల వ్యాసం వచ్చేలా, దానికి 9 రేకులు, 9 చాటలు (ఇండ్లల్లో ఆడవాళ్ళు ధాన్యం చెరుగుకునే చాటలు) ఒకదాని తర్వాత ఒకటి ఏర్పాటు చేశాడు. ఈ చాటలు, రేకులు నీటి వేగానికి కదులుతూ ఉంటాయి. వీటిల్లో చాటలు ఉన్న వాటికి 2 లీటర్ల వాటర్ బాటిళ్ళను పైన వున్న సన్నటి మూతి భాగాన్ని కోసివేసి, బిగించాడు. ఈ చక్రం తిరిగేందుకు ఒక బరువైన చట్రాన్ని ఏర్పాటు చేశాడు. ఈ పరికరాన్ని కొందరు వ్యక్తుల సహాయంతో  కాలువలో ఏర్పాటు చేశాడు శివ శంకర్.

**పని చేసే విధానం:**

కాలువలో పారుతున్న నీటి వత్తిడికి చక్రానికి ఏర్పాటు చేసిన ప్లేట్లు మరియు చాటలు వత్తిడికి గురై కదులుతూ ఉంటాయి. అప్పుడు చాటలు వున్న బాటిళ్ళలోకి నీరు వచ్చి చేరుతుంది. ఆ చక్రం అలా తిరుగుతునే ఉంటుంది. నీరు నిండిన బాటాల్ పై భాగానికి వచ్చేటపుడు అక్కడ ఏర్పాటు చేసిన నిలువుగా కోయబడిన డ్రమ్ములోకి నీటిని వంపేస్తుంది. ఆ నీరు ఒక పైపు గుండా పొలానికి చేరుతుంది. ఈ విధంగా రైతు వద్దనుకుని ఆ చక్రాన్ని ఆపేవరకు అతి నీటి వత్తిడి ద్వారా తిరుగుతునే ఉంటుంది, నీటిని తోడుతునే ఉంటుంది.

కాకపోతే ఈ నీటిని తోడే విధానం కేవలం వాలు ప్రదేశం వున్న ప్రాంతానికి మాత్రమే ఏర్పాటు చేసుకోవటానికి వీలవుతుంది.



అంతే కాదు ఎత్తైన ప్రదేశానికి నీరు తోడటం సాధ్యం కాదు. అంటే చక్రం ఎత్తు 10 అడుగులు ఉంటే నీరు ఆ ఎత్తుకన్నా తక్కువ ఎత్తుకు మాత్రమే తోడగలదు. ఈ పద్ధతిని ఒక్కసారి ఏర్పాటు చేసుకునేందుకు అయ్యే ఖర్చు తప్ప ఇక ఎటువంటి నిర్వహణా ఖర్చులుగాని, ఇంధనం కాని అవసరం లేకుండా కేవలం నీటి వత్తిడి మూలంగా పని చేస్తూనే ఉంటుంది. రోజుకు దాదాపు ఒక ఎకరం పొలానికి ఎటువంటి ఖర్చు లేకుండా నీరు పారించుకోవచ్చు.

**దీన్ని ఉపయోగించిన రైతు శ్రీనివాస రెడ్డి అభిప్రాయం:**



తన నీటి కష్టాలను మిత్రుడు శివ శంకర్‌తో చర్చించిన వెంటనే తన ఆలోచనతో ఈ నీటిని తోడే చక్రాన్ని ఏర్పాటు చేసుకున్నానని, దీన్ని ఏర్పాటు చేసిన తర్వాత తన పొలానికి నీరు సంపూర్తిగా అందుతోందని, దీన్ని ఏర్పాటు చేసేందుకు అయిన ఖర్చు కూడా నాకు పెద్దగా భారం కాలేదని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

తమ పొలాల ప్రక్కనుంచి బాగా నీరు ప్రవహించే కాలువలు ఉన్న రైతులు, ఆ ప్రాం తంలో కరెంటు సరఫరా లేనిచో డీజిల్ ఇంజ న్లతో అధిక ఖర్చు చేసి నీరు తోడుకోవలసిన అవసరం లేకుండా ఉచితంగా ప్రకృతి సహాయంతో తమ పొలానికి నీరు సునాయాసంగా తోడుకోవచ్చు అంటున్నాడు ఇన్నోవేటర్ శివశంకర్. అవకాశం ఉన్న రైతులు ఈ పద్ధతి వినియోగించుకుని తమ నీటి కష్టాలను తీర్చుకోవలసిందిగా కోరుతోంది 'పల్లెసృజన'. ●

**ఇన్నోవేటర్ శివశంకర్, ఫోన్ : 8186867071**

## సమస్యలకు ఆహ్వానం

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

చుట్టూ ఉన్న సమాజంలోని కష్టాలను గమనించండి. ఆ కష్టాలను సంపూర్తిగా అవగాహన చేసుకొని వాటి నివారణకై సమాజంలో చర్చలు జరపండి. సరియైన పరిష్కారాన్ని ఇన్నోవేట్ చెయ్యండి. అది ప్రజలకు అందు బాటులో ఉండేట్లుగా, అవసరానికి తగ్గట్లుగా, వైవిధ్యానికి వాతావరణానికి తోడు చేసేట్లుగా ఉండాలి. ఇలాంటి ఇన్నోవేషన్లు ప్రజలకు చేరిస్తే ఈ దేశం నిజమైన ఆత్మ నిర్భరత ను సాధిస్తుంది. -ఎడిటర్

# అలుపెరుగని ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' గ్రహీత చింతకింది మల్లేశం

❖ అంతరించి పోతున్న చేనేత వ్యవస్థకు ఊపిరిపోశాడు!
❖ కష్టంలో వున్న నేతన్నకు మహిళా శక్తిని జోడించాడు!!
❖ 'సరికొత్త ఆసుయంత్రం' తో పోచంపల్లి చీరకు కొత్త రూపునిచ్చాడు!!



స్కిల్ శిక్షణలో నేతక్కలు

- వీరరాఘవ రెడ్డి

"చింతకింది మల్లేశం" గురించి తెలియని 'పల్లెసృజన' పాఠకుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదేమో! 2008లో పల్లెసృజన పాఠకులకు పరిచయం చేసినప్పుడు ఇతనొక సామాన్యుడు. అందరిలా తన కుటుంబ వృత్తి 'పోచంపల్లి చీరలు నెయ్యటం' మాత్రమే కాకుండా, తన సామాజిక ప్రజల కష్టాలు తీర్చాలి అనుకున్నాడు. అది చెయ్యాలంటే ముందుగా తన తల్లి కష్టం తీర్చగలిగితే చాలు పోచంపల్లి నేత కార్మికుల కష్టాలు కూడా కనుమరుగు ఐపోతాయి అనుకుని మొదలు పెట్టిన తన పోరాటం "లక్ష్మీ ఆసు యంత్రం" తయారీతో తన ప్రాంతంలోని చేనేత కార్మికుల పట్ల ఓ అద్భుత వ్యక్తిగా రూపాంతరం చెందాడు. ఈ ఆసు యంత్రం కనిపెట్టక ముందు ఆ నేత కుటుంబాల్లో మహిళల కష్టాలు వర్ణనాతీతం. పోచంపల్లి నేత వృత్తి వారి ఆడపిల్లలు చదువుకు నోచుకునే వారు కాదు, ఆ కుటుంబంలోని మగ పిల్లలకు పిల్లనిచ్చేందుకు కూడా వెనుకాడేవారు. అందుకు కారణం ఆ కుటుంబాల్లో మహిళలు మాత్రమే చీర నేయటానికి అవసరమైన ఆసు పోసే వారు. ఆసు పోయటానికి ఒక్కో మహిళ రోజుకు వేలసార్లు చేతిని అటూ ఇటూ కదపటం వల్ల భుజాలు నొప్పి పుట్టేవి. ఆ కష్టం వర్ణనాతీతం. అందుకే ఆ కుటుంబాలకు పిల్లనివ్వాలంటే భయపడే వారు. కేవలం 30-40 సంవత్సరాలకే ముసలి వాళ్ళయినట్లుగా చేతుల నొప్పితో, ఆసుపత్రుల చుట్టూ తిరిగే వారు. కొందరు ఈ బాధలు, నొప్పులు భరించలేక తమ వృత్తిని వదిలి పట్టణాలకు వెళ్ళి ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగించాలని వలస వెళ్ళే వారు. ఇది ఆసు యంత్రం తయారీకి ముందున్న పరిస్థితి.

**అంతరించి పోతున్న వ్యవస్థకు ఊపిరి:**

చింతకింది మల్లేశం తన తల్లిపేరిట "లక్ష్మీ ఆసు యంత్రం" చేయటంతో పోచంపల్లి చేనేత వృత్తికారుల్లో ఆశలు చిగురించాయి. ఆ కుటుంబం లోని మహిళలు "హమ్మయ్య ఇక మాకు చేతులు నొప్పి పుట్టకుండా ఒక యంత్రాన్ని మా మల్లేశం తయారు చేశాడు" అని లోలోపలే ఆనందిస్తూ, బహిరంగంగా మెచ్చుకున్నారు. మల్లేశాన్ని ఆశీర్వదించారు, అభినందించారు. వారి పిల్లలను హాయిగా చదువులకు సాగనంపారు. వలస వెళ్ళి ఎక్కడో చాలీ చాలని జీతాలకు జీవనం వెలిబుచ్చే బదులు, శ్రమ తగ్గింది కాబట్టి మళ్ళీ మన వృత్తినే చేసుకుంటూ హాయిగా ఇంటివద్దనే బ్రతుకుదామని తిరిగి తమ గ్రామాలకు వచ్చారు. తమ ఆదాయం రోజు రోజుకూ వృద్ధి చెందుతూ ఉండటంతో ఒక మగ్గం వున్న వారు 3, 4 మగ్గాలను ఏర్పాటు చేసుకుంటూ, ఇంకొందరు పదుల సంఖ్యలో మగ్గాలను ఏర్పాటు చేసుకోవటం ద్వారా మాస్టర్ వీవర్స్‌గా తయారయ్యారు. ఇప్పుడు ఆ కుటుంబాలలోని మగపిల్లలకు పిల్లనివ్వటానికి ముందుకు వచ్చారు ఇతర ప్రాంతాల వారు. ఇలా దిన దినాభి వృద్ధి చెందింది 'పోచంపల్లి చేనేత పరిశ్రమ'. దీనికంతటికీ కారణం మల్లేశం తయారు చేసిన లక్ష్మీ ఆసు యంత్రం వల్ల తమ (ప్రత్యేకించి మహిళల) శ్రమ తగ్గి ఉత్పత్తి పెరగటమే.

ఇలా ఒక దశాబ్దం పాటు తమ వృత్తిలోనే తాము మరింత ఆదాయం సమకూర్చుకోవడమే కాక, స్థితిమంతులై స్వంతంగా ఇళ్ళు కట్టుకున్నారు, కొందరు కార్లు కొన్నారు, ఇంకొదరు హైదరాబాద్‌లో కూడా ఇళ్ళు నిర్మించుకున్నారు, మరి కొందరు తమ చీరలను తామే మార్కెటింగ్ చేసు కుంటూ మరింత ఆదాయం పొందుతూ తమ పిల్లలను ఉన్నత విద్య అభ్యసించేలా చేసుకున్నారు. వారి పిల్లలు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. దీనంతటికీ మూలం "లక్ష్మీ ఆసు యంత్రం" వారి జీవితాల్లో తెచ్చిన విప్లవాత్మ మార్పు. అలా మల్లేశంను ఆశీర్వదించిన వారి ఆశీర్వాదాలు వృధా కాలేదు. వారి దీవెనల బలం ఒక సామాన్యుడైన చింతకింది మల్లేశంను రాష్ట్రపతి పురస్కారాన్ని స్వీకరించేలా చేసింది. ప్రతి యువకుడు కలలు కనే లాగా, మల్లేశం నాటి


శిక్షణలో పాల్గొన్న మహిలు

భారత రాష్ట్రపతి 'అబ్దుల్ కలాం' గారితో తేనీటి విందు ను స్వీకరించేదాకా తీసుకు వెళ్ళింది. నాటి భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారితో రాష్ట్రపతి భవన్‌లో 10 రోజుల పాటు అతిథిగా ఉండేలా చేసింది.... అంతేకాక.... ఒక సామాన్యుడు "పద్మశ్రీ" పురస్కారం అందుకునేలా చేసింది.... ఆ తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీ గారి చేతుల మీదుగా "అమేజింగ్ ఇండియన్" పురస్కారం కూడా పొందేలా చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ గారు తన మన్‌కీ బాత్ లోనే కాకుండా, విదేశాల్లో కూడా చింతకింది మల్లేశం కథను ఉపన్యాసాల్లో చెప్పేలా చేసింది. అంటే ఒక సామాన్యుడు తన కృషితో ఒక వ్యవస్థనే మార్చగలడు అని నిరూపించాడు మల్లేశం.

అలా ఆనందంగా గడుపుతున్న చేనేత కుటుంబాలు మళ్ళీ ఒడిదుడుకులకు లోనయ్యేలా చేసింది మరో సమస్య. ఆసు యంత్రం రావటంతో మహిళలకు పని తక్కువయింది. వారు కేవలం మగ్గం నేయటానికి అవసరమైన ఆసును రంగులు అద్దిన తర్వాత చిటికలకు చుట్టి ఇచ్చే పని మాత్రమే చేస్తున్నారు. ఈ ప్రక్రియంతా రోజుకు కేవలం ఒకటి రెండు గంటల పని మాత్రమే. ఆ తర్వాత మహిళలు గుంపులుగా చేరి ఊసుపోని కబుర్లతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. వారికి కూడా తమ ఇంట్లోని మగవారికి సహాయ పడితే బావుంటుంది అనుకుంటున్నారే కాని, అందుకు తగ్గ శిక్షణ వారికి లేకపోవటం వల్ల ఈ అనర్థం జరుగుతోంది. మగవారు మాత్రం ఆసు పోసిన దారానికి డిజైన్ మార్కింగ్ అయిన తర్వాత, ఆ డిజైన్‌కు తగ్గట్టుగా రబ్బరు ముక్కలను అతికించి, రంగులు అద్దుకోవటం లాంటి పనుల వల్ల వారు మగ్గం నేసే పనిని నెలలో 5-10 రోజులు మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందువల్ల చీరల ఉత్పత్తి కొంత వరకు తగ్గుతుంది అని గ్రహించాడు మల్లేశం. ఆసు పోసిన దారానికి డిజైన్‌కు తగ్గట్టుగా ఆ దారానికి రబ్బరు ముక్కలను చుట్టడం, ఆ తర్వాత ఆ రంగులు అద్దటం లాంటి పనులు పెద్ద కష్టమైనవేమీ కాదు మహిళలు చేయగలిగినవే కదా, మరి ఎందుకు చెయ్యటం లేదు అని ఆలోచించాడు. ఈ పని మహిళలు చెయ్య గలిగితే, పురుషులు కేవలం మగ్గం నేసే పనిమీదనే ఉన్నట్లయితే, మరి కొంత ఉత్పత్తి (అంటే దాదాపు నెలకు 2–3 చీరలు ఎక్కువ నేయవచ్చు) పెరుగుతుంది కదా అని ఆలోచించాడు.

**కష్టంలో వున్న నేతన్నకు మహిళా శక్తిని జోడింపు:**

నేతన్నలకు మహిళా సహకారం అందించి, వాళ్ళను వీళ్ళ పనులలో భాగస్వాములుగా జోడించాలంటే మహిళలకు కొద్దిపాటి శిక్షణ ఇస్తే చాలు. వారు సునాయాసంగా ఈ పనులను చేసి మగవారిని కేవలం మగ్గం నేసే పనిలో నిమగ్నమయ్యేలా చెయ్యగలరని ఆలోచించాడు. కానీ ఇక్కడొక సమస్య ఉంది. మహిళలకు మగ్గం నేసే పనికి ముందు గల పనులను చెయ్యగలిగేలా శిక్షణ ఇస్తాము రండి అంటే ఎవ్వరూ రారు. మహిళలను శిక్షణకు వచ్చేలా చెయ్యాలంటే వారికి కొంత డబ్బు (స్టైఫండ్) వచ్చేలా చేస్తే తప్పక వస్తారు అని ఆలోచించి, పల్లె సృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారితో సంప్రదించడం జరిగింది. గణేశం గారు హైదరాబాద్ లోని "యునైటెడ్ వే" సంస్థ సహకారంతో 'సైనాప్సిస్' సంస్థతో సంప్రదింపులు జరిపి, శిక్షణార్థులకు స్టైఫండ్ ఇచ్చే ఏర్పాటు చేయటం జరిగింది.

మొదటి విడతగా శిక్షణా కార్యక్రమం 25 మందితో ప్రారంభమైంది. ఈ 25 మంది కూడా వాళ్ళ ఇంటిలో మగ్గాలు ఉన్న మహిళలను మాత్రమే ఎన్నుకోవటం జరిగింది. ఇక్కడేదో శిక్షణ పొంది, స్టైఫండ్ తీసుకుని వాళ్ళు ఇంట్లో మళ్ళీ ఖాళీగా ఉండటం అనేది జరగకుండా శిక్షణ పొందిన వారు తప్పకుండా తమ ఇంట్లోని మగ వారికి సహాయకారిగా ఉంటూ, మగ్గం పైన ఎక్కువసేపు పని చేసి ఉత్పత్తి పెరగటానికి సహకరించేందుకు ఈ శ్రద్ధ తీసుకోవటం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో మగ్గం నేసే ముందు చేసే పనుల న్నింటిని శిక్షణ లో చేర్చడం జరిగింది. ఆసు పోసిన దారానికి డిజైన్ ఎలా చెయ్యాలి, ఎలా రబ్బర్లను చుట్టాలి, రంగులు ఎలా అద్దాలి లాంటి పని అంతా మహిళలే చేసేలాగా వారిని తీర్చి దిద్దుతారు. అలా చేయటం వల్ల ఇంట్లో ని మగవారు ఎక్కువ సమయం మగ్గం పైననే పని చెయ్యటంతో ఉత్పత్తి పెగింది. అంటే నెలకు కనీసం 2–3 చీరలు అధికంగా నెయ్య గలుగు తున్నారు. ఈ విధంగా వారి కుటుంబానికి 5–6 వేల రూపాయల అధిక ఆదాయం లభిస్తోంది.

మల్లేశానికి ఈ శిక్షణ ప్రారంభమైన 15-20 రోజుల తర్వాత మగవారు మహిళలను ఎందుకు డిజైన్ పనుల వద్దకు రానివ్వ లేదు. వాళ్ళు అలా చెయ్యటానికి కారణం 'ఈ పని చాలా కష్టమైనది కావటం వల్ల, దాన్ని ఆడవాళ్ళు చెయ్యలేరు అని మగవారే ఈ పని చేసే వారు'. మరో విషయం కూడా గమనించాడు మల్లేశం. ఈ శిక్షణా కార్య క్రమం లో మల్లేశం భార్య 'సువర్ణ' కూడా చేరింది. ఆమె రోజూ రాత్రి 10-11 గంటల దాకా ఆరోజు శిక్షణా కార్యక్రమంలో నేర్చిన దాన్ని ఇంటివద్ద చేసి, బాగా తర్ఫీదు పొందాలి అనుకుంది. అప్పుడు మల్లేశం ఆమె కష్టం చూసి, ఎందుకు ఇంత రాత్రి దాకా కష్టపడుతున్నావు అని అడిగాడు. అందుకామె నాకేమీ అర్థం కావడం లేదు. ట్రెనింగ్‌లో ఏదో చెప్తున్నారు, దాన్ని అలాగే మళ్ళీ గుర్తు చేసుకుని ఇంటివద్ద చేస్తున్నానే కానీ, నాకైతే ఏమీ అర్థం కావడం లేదు అన్నది. అప్పుడు మల్లేశం నీకు మాత్రమే అర్థం కావటం లేదా, లేక ఎవ్వరికీ అర్థం కావటం లేదా అని అడిగాడు. నాకే కాదు ఎవ్వరికీ అర్థం కావటం లేదు. నేను ఇంట్లో మళ్ళీ నెమరు వేసుకుంటూ పని చేస్తున్నానే తప్ప, మిగతా వారమీ చెయ్యటం లేదు అంది. మరునాడు శిక్షణా తరగతి వద్దకు వచ్చి అందరినీ అడగగా,


స్కిల్ శిక్షణా తరగతుల ప్రారంభం



శిక్షణా తరగతులు

వాళ్ళు "మీరేదో చెబుతున్నారు, మేము దాన్ని బట్టీ పట్టినట్లు నేర్చుకుని చేస్తున్నామే తప్ప మాకైతే ఏమీ అర్థం కావడం లేదు" అన్నారు.

ఇలాగైతే శిక్షణ ఇచ్చి లాభం లేదు కదా, ఎందుకిలా జరుగుతుంది అని శిక్షణ ఇచ్చే వారి వద్దకు వెళ్ళి వివరాలు తెలుసుకున్నాడు. ఎందుకింత కష్టంగా ఉంది అని తాను కూడా ఆ పని చేసి చూశాడు. తనకు కూడా కష్టంగానే అనిపించింది. దీనికి సులువైన పరిష్కారం చూడాలి అని బాగా ఆలోచించాడు. సమస్య ఉన్నచోట పరిష్కారం తప్పక ఉంటుందని ఆ పనిని శ్రద్ధగా గమనించాడు. రెండు రోజుల తర్వాత ఈ సమస్యకి పరిష్కారంగా ఒక కొత్త 'కోడింగ్ పద్ధతి' కనుగొన్నాడు. ఆ పరిష్కారాన్ని శిక్షణా తరగతిలో మహిళలను, శిక్షణార్థులను ఒకేచోట కూర్చోబెట్టి తాను కనుగొన్న 'కోడింగ్ పద్ధతి'ని చూపించటంతో అందరూ "ఇదెంతో సులభంగా ఉంది, ఇప్పుడు మాకు అర్థమైంది" అని కేవలం ఒక్క వారం రోజుల్లో అందరూ చాలా సులువుగా రంగులు అద్దటానికి ముందు రబ్బర్లను తొడగటం, రంగులు అద్దటం పనులను చాలా సులువుగా నేర్చుకోవటం జరిగింది. ఇప్పటి వరకు పోచంపల్లి 'ఇక్కత్' చీరల తయారీలో ఇంత సులువైన పద్ధతి ఇంతవరకు లేదు. ఈ క్రొత్త పద్ధతిని కనుగొనటం ద్వారా మల్లేశం తన ఇన్నోవేషన్ జ్ఞానానికి మరింత పదును పెట్టాడు అనటంలో ఎటువంటి సందేహం లేదు. మహిళలు నేర్చుకున్న పద్ధతిని తమ ఇళ్ళల్లోని మగవారికి చేసి చూపించటంతో, వారు అరె ఇంత సులభమైన పద్ధతి ఉందా, మేమిన్ని రోజులు ఎంతో కష్టపడి చేసే పనిని మీరు ఇంత సులభంగా చేస్తున్నారా? అని ఆశ్చర్య పోయారు.

"ఒక నదిలో నీళ్ళు ఉన్నప్పుడు అవతలి గట్టుకు వెళ్ళాలంటే ఎంతో దూరం తిరిగి వెళ్ళటం కష్టంగా ఉంటుంది. అక్కడ ఒక వంతెన నిర్మిస్తే అవతలి గట్టుకు వెళ్ళటం సులువు అవుతుంది. నేను చేసిన పని ఇదే" అంటాడు చింతకింది మల్లేశం. ఇలా చేయటం వల్ల శిక్షణ ఏర్పాటు చేసిన మొదటి బ్యాచ్ మహిళలు విజయ గర్వంతో తమ శిక్షణ ముగించుకుని వెళ్ళారు. వీళ్ళను చూసి ఇతర మహిళలు మల్లేశం వద్దకు వచ్చి "అన్నా మాకు నేర్పించండి" అంటూ అడ్వాన్సుగా తమ పేర్లను శిక్షణ కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం రెండవ బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. ఇప్పుడు సమీపంలోని 'జనగాం' పట్టణంలో కూడా మరో శిక్షణా తరగతిని ప్రారంభించారు. అక్కడ కూడా 25 మంది మహిళలతో మొదటి శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. మల్లేశం కనుగొన్న సులువైన పద్ధతి ద్వారా శిక్షణ ఇవ్వటం వల్ల ఆ మహిళల్లో మగ్గం పనికన్నా ముందు చేయాల్సిన పనులన్నీ మేమూ చెయ్యగలము అన్న ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ శిక్షణకు వచ్చే మహిళలు అందరూ 35-40 సంవత్సరాల లోపు వయసు గలవారే. అందువల్ల, వీరికి మరో కళ నేర్పడం వల్ల 'పోచంపల్లి చేనేత' పని మరి కొన్నేళ్ళు నిరాఘాటంగా కొనసాగుతుంది అన్న విశ్వాసం పెరిగింది అంటాడు మల్లేశం.

ప్రస్తుతం శిక్షణ పొందిన వారిలో చాలా మంది తమ ఇళ్ళవద్ద మగవాళ్ళకు ఈ పని లేకుండా చేయటంతో వాళ్ళు తాము కేవలం మగ్గం పనికి మాత్రమే అంకితమై పోయారు. వారికి కావలసిన సహకారం అంతా ఆడవాళ్ళే చేస్తున్నారన్న ఆనందంతో ఉన్నారు. ఈ శిక్షణ వల్ల వృధాగా కాలం వెలిబుచ్చకుండా తామూ తమ భర్తలకు చేదోడు వాదోడు కావటంతో, ఆ కుటుంబం ఆదాయం పెరిగి ఎంతో ఆనందంగా తమ పనులు చేసుకుంటున్నారు చేనేత కుటుంబాల వారు.

## 'నూతన పెద్ద ఆసుయంత్రం' తో చీరకు కొత్త రూపు:

2006లో తయారైన 'లక్ష్మీ ఆసు యంత్రం' ఇప్పటి వరకు చేనేత వృత్తిని పునరుజ్జీవింప జేసింది. కానీ, కాలం మారుతుంది, వినియోగదారుల కోరికలూ మారుతున్నాయి. పోచంపల్లి ఇక్కత్ చీరలకు గిరాకీ తగ్గుముఖం పడుతోంది అని గమనించాడు మల్లేశం. ఎందుకిలా జరుగుతుంది అని పరిశీలించాడు. గతంలో చేసిన ఆసు యంత్రంలో 40 పిన్నుల వరకు మాత్రమే డిజైన్ వచ్చేది. ఇలా చేయటం వల్ల చీరపైన కేవలం 3 అంగుళాల వరకు మాత్రమే డిజైన్ వస్తుంది. అంటే చీరపైన కేవలం చిన్న చిన్న పూల లాంటి డిజైన్లు మాత్రమే వస్తాయి.

కొన్నిచోట్ల ఇదే ఆసుకు 120 పిన్నులను ఏర్పాటు చేసి, డిజైన్లు పెద్దవిగా అంటే 9 అంగుళాల వరకు వచ్చేలా చేసి చీరలు నెయ్యటం వల్ల వాటికి గిరాకీ బాగా పెరిగింది. కానీ, ఇలా 120 పిన్నుల ఆసు పొయ్యాలి అంటే చాలా శ్రమ పడాల్సి ఉంటుంది. ఆ పనంతా మళ్ళీ పాత పద్ధతిలోనే చేతితో చెయ్యాల్సి వస్తోంది. ఇది అందరికీ చెయ్యటం కుదరదు. దాంతో తమ పని తాము చేసుకుంటూ నిరుత్సాహంగా కొనసాగిస్తున్నారే కానీ, వారికి సరైన మార్గం లభించటం లేదు. ఈ పనికి కూడా ఆసు



ఆసు దారాలకు రంగులు అద్దే సులువైన పద్ధతి



నూతన పెద్ద ఆసు యంత్రం

మిషన్ లాంటిది ఏదైనా ఉందా అని అడగటం ప్రారంభించారు. ఎందు కంటే తాము నేస్తున్న చీరలకు గిరాకీ లేదు, ఇప్పుడు వినియోగదారులు అంతా పెద్ద పెద్ద డిజైన్లు గల చీరలను అడుగుతున్నారు. దీనికి పరిష్కా రం కనుగొనాలి అనుకుని దాదాపు 2 సంవత్స రాలు కష్టపడి మళ్ళీ రెండవ సారి తన ఆసు యంత్రాన్ని తానే అభివృద్ధి చేశాడు. ఇప్పుడు తయారు చేసిన ఈ 'మల్లేశం నూతన పెద్ద ఆసు యంత్రం' 120 పిన్నులకు ఆసు పోస్తుంది. అంటే ఇప్పటి నుండి 'పోచంపల్లి ఇక్కత్ చీరలు' కూడా పెద్ద పెద్ద డిజైన్లలో తక్కువ ధరకే వినియోగదారులకు అందనున్నాయి.

ఉదాహరణకు ఇప్పటి వరకు పోచంపల్లి చీరలలో కేవలం ఒక పువ్వు డిజైన్ మాత్రమే వస్తుంది, చెట్టు రాదు. ఇప్పుడు పువ్వుతో పాటు చెట్టు, ఆకులు డిజైన్ కూడా వస్తుందన్నమాట. ఈ నూతన పెద్ద ఆసు యంత్రం తయారు చేయటం ద్వారా నేతన్నలు సరికొత్త డిజైన్‌లలో చీరలు నేసే అవకాశం కలిగింది. అంటే మరి కొన్నేళ్ళ పాటు ఈ వ్యవస్థ ను కాపాడేందుకు అవకాశం కల్పించాడు చింతకింది మల్లేశం. అంతే కాదు ఇప్పుడు తయారు చేసిన ఈ 'నూతన పెద్ద ఆసు యంత్రం' కేవలం పోచంపల్లి ఇక్కత్ చీరలకు మాత్రమే కాకుండా, దేశంలోని ఒరిస్సా, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల్లోని 13 ఇక్కత్ క్లష్టర్లలో దీన్ని వినియోగించుకోవచ్చు. పదిమంది మనుషులు చేసే ఆసు పోసే పనిని ఎటువంటి మానవ శక్తి అవసరం లేకుండా కేవలం యంత్రం తయారు చేసి ఇస్తుంది. అంటే తన ఆసు యంత్రాన్ని అభివృద్ధి చేయటం ద్వారా చింతకింది మల్లేశం కీర్తి ఇప్పుడు యావత్ భారతావనికి ఉపయోగ పడుతుంది. చేనేత కార్మికులకు ఎంతో కష్టాన్ని తగ్గించటంతో పాటు గణనీయమైన ఆదాయం పెరిగేలా చేస్తుంది. అధిక ఉత్పత్తి జరిగేలా చేస్తుంది.

**ఉపసంహారం:**

తన తల్లి కష్టాన్ని చూసి భరించలేక తయారు చేసిన ఆసు యంత్రం అంతరించి పోబోతున్న 'పోచంపల్లి చీరల' ఉత్పత్తిని ద్విగుణీ కృతం చేయటంతో పాటు, ఎంతోమంది చేనేతకారుల కష్టాలను కడతేర్చాడు చింతకింది మల్లేశం.

ఆసు యంత్రం తయారీతో ఇంట్లో ఆడవాళ్ళ శారీరక శ్రమను పూర్తిగా నిర్మూలించాడు మల్లేశం.

వారు ఎటువంటి పని చెయ్యాల్సిన అవసరం లేకుండా చేయటం అయితే జరిగింది కానీ, మగ్గం పైన నేత నేయటంతో పాటు, ఆసు పోసిన దారానికి డిజైన్లు ఏర్పాటు చేయటం, రంగులు అద్దటం అంతా మగవారి పనే అయింది. మళ్ళీ నేతన్నల కష్టాలను తగ్గించేందుకు, వారికి మహిళల తోడు నేతన్నలకు అందించాలన్న తలంపుతో మహిళా చేనేత వృత్తిదారులకు శిక్షణలు ఏర్పాటు చేసి, ఆ శిక్షణలో సులువైన మార్గం చూపి చేనేత వృత్తి మళ్ళీ అంతరించి పోయే పరిస్థితి రాకుండా చేశాడు చింతకింది మల్లేశం.

ప్రస్తుత మారుతున్న కాలంలో వినియోగదారుల కోరికలు పెరిగిపోవటంతో పోచంపల్లి చీరల గిరాకీ మళ్ళీ తగ్గుముఖం పట్టిందని తెలుసుకుని, దాన్ని పరిష్కరించడానికి 'నూతన పెద్ద ఆసు యంత్రం' తయారు చేసి, మరి కొన్ని దశాబ్దాల పాటు తమ వృత్తికి ఎటువంటి ఢోకా లేదు అన్న సందేశాన్నిచ్చాడు చింతకింది మల్లేశం.

ఒక వ్యవస్థను నిరంతరం కాపాడటంలో తన మేధస్సుకు ఎప్పటికప్పుడు పని పెడుతూ, తన వృత్తిదారులను ఎప్పటికప్పుడు జాగృత పరుస్తూ, వారి కుటుంబాలు సుసంపన్నంగా ఉండేందుకు కృషి చేస్తున్న చింతకింది మల్లేశం నిజమైన 'అమేజింగ్ ఇండియన్'. 'పద్మశ్రీ' పురస్కారానికే కాదు భారత దేశంలోని ఇంకా అత్యున్నత పురస్కారాలకు కూడా అర్హుడైన వాడు చింతకింది మల్లేశం.

తెలంగాణ ప్రభుత్వం సహాయంతో చేనేత పరిశోధనా సంస్థ ను మల్లేశం ఆలేరులో స్థాపించారు. తన కమ్యూనిటీకి పరిశోధనలతో అధిక దిగుబడి, తక్కువ శ్రమ ఉండే సాంకేతిక ఇన్నోవేషన్లను ఈ పరి శోధనాశాల సహాయంతో తయారు చేద్దామన్న కోరిక "నూతన పెద్ద ఆసుయంత్రం" తో పూర్తయింది. ఆయన చిత్తశుద్ధికి మనసారా అభినందనలు.

ఈ వ్యాసకర్తగా నేను (పల్లె వీరరాఘవ రెడ్డి) మొదట మల్లేశం తో ఇంటర్వ్యూ తీసుకునేటపుడు ఆసు యంత్రం చాలా కుటుంబాల్లో మార్పు తీసుకు వస్తుందని మాత్రమే ఊహించాను. కానీ, పూర్తి వ్యవస్థకు దన్నుగా నిలవటంతో పాటు, వారిని అత్యున్నతంగా తీర్చి దిద్దుతుందన్న విషయం నా ఊహకు కూడా అందలేదు. ఇంతటి విప్లవాత్మకమైన మార్పును తెచ్చిన చింతకింది మల్లేశంకు నేను, 'పల్లె సృజన' కుటుంబం హృదయ పూర్వకంగా అభినందనలు తెలియ జేస్తోంది. ●

**ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం, ఫోన్ : 7989403563**



# 'సేంద్రియ వ్యవసాయం' చేయాలనుకున్న రైతులకు రైతు శాస్త్రవేత్తల సూచనలు

- వీరరాఘవ రెడ్డి

"ప్రకృతి మనకు ప్రసాదించిన అన్ని వనరులకి మూలం 'భూమి'. కానీ ఒకవిధంగా చెప్పాలంటే వ్యవసాయంలో దాన్ని కర్కశంగా వాడుకుంటున్నాము. అందువల్ల భూమి సారాన్ని శాశ్వతంగా కోల్పోయే ప్రమాద దశకు చేరుకుంటోంది. అదే జరిగితే మనందరికీ తిండి దొరకని పరిస్థితికి చేరే ప్రమాదం పొంచివుంది. కనుక ఈ దశలో వ్యవసాయం చేస్తూ భూమి వాసి తగ్గకుండా కాపాడుకోవటం మన కనీస ధర్మం"

**'పద్మశ్రీ' గ్రహీత "చింతల వెంకట్ రెడ్డి" సూచన:**

ఒకటి రెండు సంవత్సరాలు పొలంలో ఎటువంటి పంట వేయకుండా ఉన్నట్లయితే, ఆ తర్వాత వేసిన పంట అధిక దిగుబడి వస్తుంది అన్న విషయం ప్రతి రైతుకు తెలుసు. అందుకు కారణం కొత్తమట్టిలో పంట ఏపుగా పెరిగి, దిగుబడి అధికంగా వస్తుంది. అలాగని రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి పంట వేయకుండా పొలం బీడు పెట్టాల్సిన అవసరం లేదు. మన పొలాన్ని కొత్త మట్టిగా చేస్తే చాలు మంచి దిగుబడులు సాధించవచ్చు.

**పొలాన్ని కొత్త మట్టిగా తయారు చెయ్యటం:**

పొలంలోని ఒక గట్టు వెంట (గట్టుకు 3-4 అడుగుల లోపలికి) జెసిబి తో 2-3 అడుగుల వెడల్పులో 4 అడుగుల లోతు గొయ్యి తీయించండి. ఆ గొయ్యి తీయటం ద్వారా వచ్చిన మట్టిని గట్టు వైపుకు వేయించండి. ఆ తర్వాత పొలం లోని పైపై మట్టి మొత్తాన్ని జెసిబి లేదా ట్రాక్టర్ లోడర్ ద్వారా గట్టువెంట త్రవ్విన గుంటను పూడ్పించాలి. ఆ తర్వాత పొలం పొత్తం దుక్కి దున్ని, బాగా ఎండ తగిలేలా చేయండి. ఆ తర్వాత గట్టు వెంట గుంత త్రవ్విన మట్టిన పొలంలో ఎక్కడైనా చెట్టు వుంటే ఆ చెట్టు క్రిందకు లేదా పొలంలోని ఒక మూలకు ఆ మట్టిని చేర్చి, దానిపైన ఒక టార్పాలిన్ కప్పి ఉంచండి. ఈ మట్టి భవిష్యత్తులో వర్షానికి తడవకుండా కాపాడుకోవటం చాలా ముఖ్యం.

దుక్కి దున్నిన పొలాన్ని తొలకరి వర్షం పడిన వెంటనే గొర్రు మరియు గుంటకతో రూపు చేయండి. ఈవిధంగా చేయటం వల్ల మీ పొలం కొత్త మట్టిగా మారుతుంది. ఆ తర్వాత మీ పొలంలో ఏ పంట విత్తినా సరే రెండు మూడు సంవత్సరాల పాటు మీరు ఊహించనంత బాగా ఏపుగా పెరిగి అధిక దిగుబడిని వస్తుంది.

తర్వాత ఆ పంటపైన పొలంలో ఒకచోటకు చేర్చిన మట్టి నుండి రెండు మూడు తట్టల మట్టిని, మొలకెత్తిన గోధుమలు లేదా సోయాబీన్స్ విత్తనాలను (ఒక కిలో) మెత్తగా రుబ్బించి, 200 లీటర్ల నీటిలో కలిపి, ఆ నీరు కొద్దిగా తేరుకున్న తర్వాత ఒక గుడ్డతో వడబోసి, పంటపై పిచికారి చేస్తే చాలు మీ పంటను ఎటువంటి చీడ పీడలు ఆశించక పోవటమే కాక, పంట చాలా ఏపుగా పెరుగుతుంది. మీకు ఓపిక ఉంటే ఆ మట్టిలో అర లీటరు ఆముదము, అర కిలో కుంకుడు కాయల రసం కలిపితే ఇంకా మంచి ఫలితాలు మీరు చూస్తారు అంటారు చింతల వెంకట్ రెడ్డి. ఈ పద్ధతిలో పంటలపై పిచికారి చెయ్యటం ద్వారా మీ పంటలను ఎటువంటి హానికర క్రిములు ఆశించవు. అలాగే మిత్రు పురుగుల ఉధృతి విపరీతంగా పెరిగి అవే మీ పంటను మిలటరీ లాగా కాపాడుతాయి. ఇక ఎరువుల విషయానికి వస్తే. ఇదే మట్టి మీ పంటకు ఎరువుగా కూడా పని చేస్తుంది.

**మట్టి నీరు పురుగు మందుగా ఎలా పని చేస్తుంది?:**

పంటను ఆశించి నష్టం చేసే క్రిమి కీటకాలకు లివర్, ఊపిరి తిత్తులు ఉండవు. మనిషి లేదా పశువులు మట్టిని తిన్నా లివర్ ఉండటం వల్ల అది అరిగి పోతుంది. గాలిని ముక్కు ద్వారా తీసుకోవడం జరుగుతుంది. అందువల్ల మట్టి ద్రావణాన్ని పంటపై పిచికారి చేసినట్లయితే ఆ నీటిని పురుగులు సేవిస్తే లోపలికి వెళ్ళిన మట్టి రేణువులు అరగక పురుగు కేవలం 3-4 గంటల్లో చనిపోతుంది. లేదా పిచికారి చేసినప్పుడు మట్టి నీరు పురుగు శరీరంపైన పడటం వల్ల, అవి తమకు అవసరమైన గాలిని తీసుకునేందుకు ఊపిరి తిత్తులు ఉండవు. అవి గాలిని శరీరం ద్వారానే తీసుకుంటాయి. కాబట్టి పిచికారి చేసిన మట్టి ద్రావణం ఆ శరీర రంధ్రాలను మూసివేయటం వల్ల ఊపిరి ఆడక చనిపోతాయి. ఒకవేళ ఇవన్నీ తట్టుకొని బ్రతికినా ఇక ఇక్కడ తమకు క్షేమం కాదని వేరే పొలాలకు వలస వెళ్ళిపోతాయి. అక్కడ గుడ్లు కూడా పెట్టవు.












**మట్టి ఎరువుగా ఎలా పని చేస్తుంది?:**

ఎండా కాలంలో మనం పొలాన్ని లోతుగా దున్నుకుని పొలం ఎండ తగిలేందుకు అనువుగా తయారు చేసి ఉంచుతాం. ఆ తర్వాత తొలకరి వర్షానికి తడిచిన వెంటనే మట్టి నుండి ఒక విధమైన తియ్యటి సువాసను గమనించని వారుండరు. అది ప్రకృతి ధర్మం. ఎందుకంటే దున్ని పెట్టిన పొలంలోని మట్టికి సూర్యకిరణాలు బాగా తగలటం వల్ల మట్టికి ఒక విధమైన శక్తి వస్తుంది అంటారు చింతల వెంకట్ రెడ్డి.

అందుకే పొలంలో త్రవ్విన మట్టిని కొన్ని రోజులు ఎండిన తర్వాత పొలంలో ఒక మూలకు చేర్చి దానిపైన టార్పాలిన్ కప్పి వర్షానికి తడవకుండా ఉంచాలి. అలా ఎండకు బాగా ఎండిన మట్టిని మీ పంటకు 20–30 రోజులకు ఒకసారి పంట వేర్లకు అందించ గలిగితే చాలు ఆ మట్టిలోని శక్తిని మొక్కలు గ్రహిస్తాయి. ఎన్ని వేలు ఖర్చు చేసి వేసిన రసాయన ఎరువులు అందించని పోషకాలను మొక్కలకు ఆ మట్టిలోని శక్తి అందిస్తుంది. ఇది చాలు పంటలు ఆరోగ్యంగా పెరగటానికి, రుచిగా ఉండటానికి. ఈ పద్ధతిని అన్ని రకాల పంటలకు ఉపయోగించవచ్చు. వరి లాంటి పంటకు నీరు అందించే కాలువ వద్ద ఒక వ్యక్తి మట్టిని పోస్తూ ఉంటే చాలు వరి పంటకు కావలసిన పోషకాలన్నీ అందుతాయి. మిగతా పంటలకు చెట్టు మొదలు వద్ద దోసెడు మట్టి వేస్తూ ఉంటే చాలు. మీ పంటలన్నీ ఆరోగ్యంగా పెరగటంతో పాటు, అధిక దిగుబడి, నాణ్యమైన దిగుబడి పొందటంతో పాటు, ఎటువంటి కల్మషాలు లేని ఆహారం సమాజానికి అందించిన వారవుతారు అంటాడు చింతల వెంకట్ రెడ్డి.

**వ్యవసాయంలో నష్టాల నివారణకు మునిరత్నం నాయుడు సూచన:**

తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం లోని 'కస్తూరి కండ్రిగ' గ్రామానికి చెందిన 75 సంవత్సరాల రైతు "పాలడుగు మునిరత్నం నాయుడు" పెట్టుబడి లేని వ్యవసాయం చేసే మార్గాన్ని తాను ఆచరిస్తూ తోటి రైతులకు సూచిస్తున్నారు.

కొందరు అవగాహన కలిగి రైతులు తాము కూడా ప్రకృతి వ్యవసాయం మొదలు పెట్టాలి అనుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయ



పద్ధతిలో తక్కువ దిగుబడి వస్తుంది, నష్టాలు వస్తాయి అనే అపోహలు నమ్మకుండా ఈ విధంగా పంట విత్తుకునే విధానాలు అమలు చేస్తే ప్రకృతి వ్యవసాయం ద్వారా కూడా రసాయన వ్యవసాయానికి ధీటుగా దిగుబడి సాధించవచ్చు. రైతుకు ఎటువంటి నష్టం జరగకుండా లాభాల బాట పట్టవచ్చు అంటారు మునిరత్నం నాయుడు.

**నష్టాలు రాకుండా పంటలు పండించే పద్ధతి:**

పంట వేసిన తర్వాత ఎవరికి తోచిన విధంగా వారు కషాయాలు, రసాయన రహిత పురుగు మందులను ఉపయోగించి మీ పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టండి.

అలాగే ప్రతి 5 ఎకరాల రైతు తమ పొలం లో పైన వివరించిన పట్టికలో చూపిన విధంగా అర ఎకరంలో మీ ఇంటి ఖర్చుల కొరకు కూరగాయలు, ఒక ఎకరంలో మార్కెట్‌లో అమ్మేందుకు కూరగాయల సాగు, మూడున్నర ఎకరాల్లో ప్రధాన వ్యాపార పంటలైన వేరుశనగ, మిర్చి, చెఱకు, వరి, మొక్కజొన్న, ప్రత్తి లాంటి పంటలను విత్తుకోవాలి. ఇలా చేసుకున్నట్లయితే రైతు ఎటువంటి అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా లాభాల బాట పట్టవచ్చు అంటాడు మునిరత్నం నాయుడు.

ఈ పద్ధతి వల్ల మీ కుటుంబానికి ఆరోగ్యకరమైన కూరగాయలు మీకు లభిస్తాయి. కూరగాయల కొరకు మీరు ఎటువంటి ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఒక ఎకరంలో నాటిన కూరగాయలను మార్కెట్‌కు తరలించండి. ఒక ఎకరంలోని కూరగాయల పంట నుండి వచ్చే ఆదాయాన్ని మూడున్నర ఎకరాల్లో నాటిన ప్రధాన వ్యాపార పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, కూలీల కొరకు వినియోగించుకోండి.

ఇలా చేయటం వల్ల ప్రధాన పంట నుండి వచ్చే ఆదాయం నేరుగా మీ బ్యాంకులోకి వెళుతుంది. అప్పుడు మీ కుటుంబ అవసరాలకు ఈ డబ్బు కేటాయించుకోవచ్చు. వ్యవసాయం కొరకు ఎటువంటి అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. ప్రకృతిని అనుసరించి వ్యవసాయ పద్ధతులను ఆచరించి ప్రతి రైతు తమ భూమిని కాపాడు కోవటంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహార పంటలను పండిస్తూ సమాజానికి ఆరోగ్యాన్ని పంచి, మీ కుటుంబం కూడా ఎటువంటి రసాయనాలు లేని ఆహారం భుజించాలని కోరుకుంటున్నారు మునిరత్నం నాయుడు.

ఈ పద్ధతులను ప్రతి రైతు ఆచరించి, వ్యవసాయంపై పెట్టుబడులను గణనీయంగా తగ్గించుకుని ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను పండించాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'.

**ఈ పద్ధతులను గురించిన వివరాల కొరకు సంప్రదించండి :**
**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904 / 7989038186**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## వేరుశనగ త్రవ్వి తీసే యంత్రం

**సమస్య - పరిష్కారం:**

వాణిజ్య పంటలలో వేరుశనగది ప్రథమ స్థానమనే చెప్పుకోవచ్చు. దీన్ని ప్రధాన పంటగాను, కందితో మిశ్రమ పంటగాను రైతులు సాగు చేస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ పంట సాగుకు పడే కష్టానికి దాదాపు రెట్టింపు కష్టం పంట కోతకు పడుతుంది. దీనికి ప్రధాన కారణం కూలీలు లభించకపోవడం, ఒకవేళ లభించినా అధిక మొత్తంలో చెల్లింపులు. పర్యవసానంగా ఈ పంట సాగులో పెట్టిన ఖర్చులకి తగ్గ ఫలితం రావటం లేదు. దీనికి పరిష్కారంగా వేరుశనగ కాయలనును భూమినుండి తీసి వేరు చేయటానికి గుజరాత్‌కు చెందిన "సంజయ్ కుమార్ డి. తిల్వా" అనే రైతు ఒక పరికరం తయారు చేశాడు.

**పరికరం:**

ట్రాక్టర్‌తో అనుసంధానం చేసుకుని పని చేసే ఈ పరికరం 540 లేదా 1000 ఆర్‌పిఎం వేగానికి అనువుగా తయారు చేయబడింది. ఈ పరికరం వేరుశనగ చెట్లను భూమినుండి త్రవ్వి తీస్తుంది. తీసిన మొక్కలు ఒక కన్వేయర్ బెల్టు ద్వారా వెళ్తూ ఆ కన్వేయర్ బెల్టులోని కుదుపులకు చెట్టు నుండి వేరుశనగ కాయలు వేరౌతాయి. ఇలా కుదుల కారణంగా కాయలను అంటుకుని వున్న మట్టి కూడా వేరు చేయబడి వేరుశనగ కాయలు నాణ్యతగా ఉండటం వల్ల మార్కెట్లో మంచి ధర కూడా లభించే అవకాశముంటుంది.



**సాంకేతిక వివరాలు:**

- ఈ యంత్రం ఉపయోగించటానికి గంటకు ఒక లీటరు డీజిల్ ఖర్చవుతుంది.
- 35 హార్స్‌పవర్‌ల శక్తిగల ట్రాక్టర్‌తో దీన్ని అనుసంధానం చేసుకోవచ్చు.
- ఈ పరికరం 510 కిలోల బరువుంటుంది.
- పంట నూర్పిడి 98 శాతం జరుగుతుంది.
- పరికరం 1250 మి.మీ. వెడల్పు ఉంటుంది.
- 100-120 మి.మీ. లోతుకు త్రవ్వి వేరుశనగను పీకుతుంది.

**ముఖ్యాంశాలు:**

- ఇటువంటి ఇతర పరికరాలతో పోలిస్తే ఇది వేరుశనగ పంటను త్రవ్వి తీయటమే కాకుండా కాయలను శుభ్రం చేసి పెడుతుంది.
- ఇతర వరికరాలకన్నా కాయులు దెబ్బ తినకుండా చాలా






సమర్థవంతంగా పని చేస్తుంది.

- ఈ సాధనంతో గంటకు ఒకటిన్నర ఎకరాల్లో వేరుశనగను పీకి కాయలు వేరు చేస్తుంది.
- ఇది అన్ని రకాల భూముల్లో పని చేస్తుంది.

**పురస్కారాలు:**

- ఇన్నోవేటర్ సంజయ్ కుమార్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు 7వ జాతీయ ఇన్నోవేషన్ పోటీలలో బహుమానమే కాక, 2013లో ఉత్తమ సాంకేతిక జ్ఞాన పురస్కారం కూడా లభించింది.
- 2004 లోనే పేటెంటుకు నమోదు చేయటం జరిగింది.

## పసుపు కొమ్ముల నూర్పిడి యంత్రం

**సమస్య - పరిష్కారం:**

ఏ పంట అయినా కోతకు వచ్చిన తర్వాత సరియైన సమయంలో నూర్పిడి చేస్తేనే నాణ్యమైన పంట రైతుకు అందుతుంది. కానీ, కూలీలు సమయానికి లభించే స్థితిలో లేనప్పుడు రైతు ఎంతగానో నష్టపోతుంటాడు. ఇటువంటి పరిస్థితుల్లో నూర్పిడి యంత్రాలు రైతాంగాన్ని ఎంతగానో ఆదుకుంటాయి అన్నది నిర్వివాదాంశం. ప్రస్తుతం భారత రైతాంగానికి సరియైన నూర్పిడి యంత్రాల లోటు ఒక పెద్ద సమస్య. ఈ సమస్యకు పరిష్కారంగా తమిళనాడుకు చెందిన





రామరాజు అనే రైతు ఒక పరికరాన్ని రూపొందించాడు.

**పరికరం:**

ఈ పరికరం 'పవర్ టిల్లర్' కు అనుసంధానం చేయటం ద్వారా పని చేస్తుంది. పవర్ టిల్లర్ వెనక భాగంలో దీన్ని అమర్చాల్సి వుంటుంది. ఈ నూర్పిడి యంత్రానికి అమర్చిన బ్లేడ్లు వెనకకు, ముందుకు తిరగటం ద్వారా పసుపు కొమ్ములకు అంటున్న మట్టిని తొలగిస్తాయి. కానీ, వాటికి ఎటువంటి నష్టమూ జరగకదు.

**సాంకేతిక వివరాలు:**

- ఈ పరికరాన్ని 10-12 హార్స్‌పవర్‌ల శక్తిగల పవర్ టిల్లర్‌కు తగిలించాలి.
- మూడు కొయ్యలున్న ఈ పరికరం భూమిలోకి సులువుగా చొచ్చుకొని పోతుంది.
- పొలం దున్నవలసిన లోతును క్రమబద్ధీకరించే వీలు కూడా కలదు.
- 8 స్టీలు పట్టీలు బ్లేడ్లు చివర తగిలించబడ్డాయి.
- బ్లేడ్లు భూమిని దున్నేటప్పుడు 10 అంగుళాల వెడల్పు, వెనక పట్టీలు 22 అంగుళాల వెడల్పు దున్నుతాయి. అందువల్ల నూర్పిడి త్రిభుజాకార రూపంలో భూమిని దున్నినట్టుగా కనిపిస్తుంది.
- ఈ నూర్పిడి పరికరంతో ఒక ఎకరం పసుపు కొమ్ములను 5 గంటల్లో తీయవచ్చు.

**ముఖ్యాంశాలు:**

- పంట నూర్పిడి విధానం ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. రైతుకు ఎటువంటి నష్టము జరగకుండా, అతి తక్కువ పంటనష్టంతో నూర్పిడి చేసుకోవచ్చు.
- మనుషులతో పసుపు నూర్పిడి చేసే పద్ధతికన్నా, ఈ యంత్రం ద్వారా నూర్పిడి చేయటం వల్ల 50 శాతం కూలీల ఖర్చు ఆదా అవుతుంది.

**పురస్కారాలు:**

- ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్ 2013 పోటీలలో 'కన్సోలేషన్' బహుమతి అందుకున్నాడు ఇన్నోవేటర్ రామరాజు.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

**సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)**

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి

## 25వ సూచన



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## రెడీమేడ్ పూరీ, పరోట, మడత చపాతీ తయారీ యంత్రంతో యువతకు ఉపాధి, ధాబా యజమానులకు ఊరట

అనంతపురం జిల్లా గోరంట్ల మండల కేంద్రానికి చెందిన అద్దంకి జయేశ్వర్ రావు (ఎ.జె. రావు) సామాన్య జనావళికి అందుబాటులో వుండేలా రకరకాల వస్తువులను కనుగొనడం, తయారు చేయాలన్న తపన కలవాడుఎ.జె. రావు.

దేశంలోని అన్ని ప్రధాన రహదారుల వెంట ధాబాలు ఉంటాయన్న సంగతి అందరికీ తెలుసు. ఈ ధాబాలలో ప్రధాన వంటకం చపాతి, పరోట, పుల్కా, పూరి. వీటిని తయారు చేయటానికి ఒక ప్రత్యేక నైపుణ్యం గల వ్యక్తులు అవసరం. అయితే ప్రతి ధాబా యజమానులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చపాతి చేసే మనుషుల కొరత. ఈ వ్యక్తులకు నెలకు దాదాపు 20 వేల దాకా ఖర్చవుతుంది. పైగా వీరు ఎప్పుడు పని ఎగ్గొడతారో తెలియక పోవటంతో చాలా ఇబ్బందుల పాలవటం గమనించాడు ఎజె రావు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎక్కువ మోతాదులో చపాతీలు తయారు చేసే యంత్రాలు ఉన్నాయి కానీ, అవి ఖరీదుతో కూడుకున్నవే కాక, హొటల్ యజమానుల అవసరాన్ని అనుకున్న స్థాయిలో తీర్చలేక పోతున్నాయని గ్రహించాడు.

ఈ సమస్య పరిష్కారంగా ఎజె రావు తయారు చేసిన ఈ యంత్రాన్ని రహదారిలో వున్న గ్రామీణ యువతీ యువకులు తమ నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా చేసుకుని స్వంత వ్యాపారాన్ని చేసుకోవచ్చు. దీని సహాయంతో పూరి, చపాతి, పరోటాలను తయారు చేసి వాటిని అతి తక్కువ వేడితో కాల్చడం, వాటిని నిలువ చేసుకుని ప్రతి రోజు వారి సమీపంలోని అన్ని ధాబాలకు పెద్ద పెద్ద హొటళ్ళకు సరఫరా చేయటం ద్వారా ఉపాధి పొందవచ్చు. హొటళ్ళు, ధాబాల యజమానులు వీటిని సాధారణ వ్యక్తి ద్వారా అప్పటికప్పుడు వినియోగ



దారులకు అవసరమైనన్ని చపాతీలు, పుల్కాలు, పరాటాలను వేడి చేసి సరఫరా చేసుకోవచ్చు. ఈ సమస్య పరిష్కారం వల్ల ప్రత్యక్షంగా నిరుద్యోగ యువత, హోటల్ యజమానులు లాభం పొందవచ్చు.

ఈ సమస్య పరిష్కారానికి పుల్కాలు, చపాతి, పరోటా, పూరీ అన్నీ చేయగలిగే యంత్రాన్ని రూపొందించాడు. దాంతో చపాతీ, పరోటా, పూరీల తయారు చేయటానికి కొంతమందికి శిక్షణ కూడా ఇచ్చాడు.

తాము అనుకున్నట్లుగా అన్నీ తయారైన తర్వాత వీటన్నిటిని ప్యాకెట్లలో వేసి శాంపిల్స్ తీసుకుని గతంలో వెళ్ళిన కష్టమర్ల దగ్గరకి వెళ్ళగా చాలామంది వాటిని తీసుకోవటానికి మొగ్గు చూపారు. ఇప్పుడు రోజుకు 4 నుండి 5 వేల వరకు చపాతి, పరోటా, పుల్కాలు తయారు చేసి మార్కెట్‌లో అమ్మగలుగుతున్నాడు. 6 నుండి 8 నెలల శ్రమతో ఈ యంత్రాన్ని విజయవంతంగా తయారు చేయగలిగాడు ఎజె రావు. ఈ యంత్రం ద్వారా తాను మాత్రవే ఉపాధి పొందటమే కాకుండా గ్రామాల్లోని యువత కూడా ఉపాధి పొందవచ్చు అని యంత్రాలను తయారు చేయటం ప్రారంభించాడు.

అంతటితో ఆగకుండా ఈ రొట్టెలు చేయటానికి పిండి ముద్దను కూడా సరియైన కొలతలతో కత్తిరించి ముద్ద బైటికి వచ్చేలా కూడా మరో అనుబంధ యంత్రాన్ని తయారు చేశాడు. తాను తయారు చేసిన ఈ యంత్రం ద్వారా తయారైన రొట్టెలు 3 నుండి 4 రోజుల వరకు నిల్వ ఉంటాయని, హోటల్ యజమానులు తాము కొనుగోలు చేసిన రొట్టెలు పాడైపోతాయేమో అన్న బెంగ అవసరం లేదు.

ప్రస్తుతం ఈ రెడీమేడ్ రొట్టెలు తయారు చేసే యూనిట్ పెట్టాలనుకునే తమతమ ఇళ్ళలోనే ఈ యూనిట్ ఏర్పాటు చేసుకున్నట్లయితే తమ ఇంట్లోనే మంచి ఉపాధి పొందవచ్చు. ఈ యూనిట్ ప్రారంభించేందుకు కావలసినవి

1. పిండి కలిపే యంత్రం.
2. ముద్దను కత్తిరించే యంత్రం.,
3. ప్రెస్సింగ్ మరియు కొద్దిగా వేడి చేసే యంత్రం.

ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు మంచి ఉపాధి పొందటంతో పాటు ఎంతో ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. ఈ యంత్రాన్ని ముఖ్యంగా క్యాటరింగ్ చేసేవారు, క్యాంటీన్, కళాశాలల హాస్టల్‌లు, హోటల్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్‌ల వారికి ఎంతో ఉపయుక్తంగా వుంటుంది.

కాబట్టి గ్రామీణ యువత మొదటి రెండు యంత్రాలను కొనాల్సిన అవసరం లేకుండా మిగతా పనులన్నీ తామే స్వయంగా చేసుకుని, రొట్టెలు చేసే యంత్రాన్ని మాత్రం కొనుగోలు చేసుకుని మొదట పని ప్రారంభించవచ్చు. పైన తెలిపిన వారికి సరఫరా చేసి ఇవ్వటం ద్వారా తమ వ్యాపారం మొదలు పెట్టి, వ్యాపారం అభివృద్ధి



చెందిన తర్వాత మిగతా యంత్రాలను కొనుగోలు చేసుకోవచ్చు. ఈ వ్యాపారం ఏర్పాటు చేసుకోవటం ద్వారా రొట్టెలు చేసే వారికి ఉపాధి తో పాటు, వాటిని మార్కెటింగ్ చేసే వ్యక్తులకు కూడా ఉపాధి లభిస్తుంది. హోటళ్ళ యజమానులకు కూడా తక్కువ ఖర్చుతో రొట్టెలు, చపాతీలు, పరోటాలను వినియోగ దారులకు అందించవచ్చు. ఈ రొట్టెల తయారీలోనే కొంత వరకు వేడి చేసి ఉండటం వల్ల కొన్ని రోజుల పాటు నిల్వ ఉన్నా అవి పాడైపోయే అవకాశం చాలా తక్కువ. తయారైన రొట్టెలను 10 లేదా 25 రొట్టెల చొప్పున ప్యాకింగ్ చేసి సరఫరా చేయవచ్చు.

ఈ వ్యాపారం ప్రారంభించాలి అనుకున్న వారు వారి తాహతును బట్టి, తమకు అవసరమైన యంత్రాలను అంటే చిన్నగా వ్యాపారం మొదలు పెట్టాలి అనుకునే వారు తక్కువ మోతాదులో రొట్టెలు చేసే యంత్రాన్ని, పెద్దయెత్తున వ్యాపారం చెయ్యాలి అనుకునే వారు అధిక మొత్తంలో రొట్టెలు చేసే యంత్రాన్ని కొనుగోలు చేయవచ్చు. ఇంట్లో తయారైన రొట్టెను తమ వాహనంపైన వెళ్ళి ఆయా హోటళ్ళకు సరఫరా చేయటం ద్వారా నిత్యం స్వయం ఉపాధి పొందవచ్చు. ●

యూనిట్ ఏర్పాటు చేయాలనుకునేవారు సంప్రదించండి :

**ఇన్నోవేటర్ ఎ.జె. రావ్ ఫోన్ నెం. : 97009 45435**

**సుభాష్ చందర్, 96528 01700**

**వీరరాఘవ రెడ్డి, 8125799904**



పిండి కలిపే యంత్రం



ముద్దలు కత్తిరించే యంత్రం



వ్యాపారానికి సిద్ధంగా వున్న రొట్టెలు

విశేషాలు

# నవంబర్- డిశంబర్ 2024 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాల చిత్రాలు







1 ఫిబ్రవరి, 2025 సాయంత్రం హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ నందు జరిగిన "ఫౌండర్స్ ఫెస్ట్ '24" కార్యక్రమంలో పల్లెసృజనకు 'బెస్ట్ గ్రాస్ రూట్స్ ఇంక్యుబేటర్' పురస్కారం లభించింది. మన ఇన్నోవేటర్లు నాగభూషణం, మోధా శివకుమార్ లకు 'బెస్ట్ రూరల్ ఇన్నోవేటర్' పురస్కారాలు లభించాయి. ఈ పురస్కారాలు తెలంగాణ ఐటి కార్యదర్శి జయేష్ రంజన్ గారి చేతుల మీదుగా అందజేయ బడ్డాయి.



76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ లోని దోమకొండ కోటలో దోమకొండ గ్రామాభవృద్ధి సంస్థ మరియు లైఫ్ ఎన్జీవో వారు నిర్వహించిన ఒక కార్యక్రమానికి పల్లెసృజన ఇన్నోవేటర్లను ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ గారు ఇన్నోవేటర్లను, వాలంటీర్ సుభాష్‌లను సత్కరించడం జరిగింది.





Certificate
OF ACHIEVEMENT

Forbes
We Serve INDIA
CELEBRATING INDIANS WHO SELFLESSLY SERVE INDIA
PRESENTED BY

This is to certify that

Siva Kumar Modha

has been recognized as the Regional Runner Up for their exceptional contribution and outstanding commitment to social work in Healthcare and Sanitation category, embodying the true spirit of service and positive change through their efforts!

| | | | |
|---|---|---|---|
| 5 February 2025 | Kochi | Vivek Narayan | A P Singh |
| Awarded On | City | Managing Editor – South, Network18 | International First Vice President, Lions Clubs International |

5 ఫిబ్రవరి, 2025 న ముంబాయికి చెందిన "ఉయ్ సర్వ్ ఇండియా" సంస్థ తరుఫున పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన 'కొమెర జాజి'కి "వన్యప్రాణి సంరక్షకుడు" పురస్కారానికి ఎంపిక చేయడం జరిగింది. అలాగే చేనేత వృత్తిదారుల ఆరోగ్య రక్షకు ఉపయోగ పడే విధంగా 'మోధా పెడల్ లిఫ్టింగ్' యంత్రంతయారు చేసినందుకు మోధా శివకు "హెల్త్ కేర్ & శానిటేషన్" విభాగంలో పురస్కారం అందజేయటం జరిగింది. దేశ వ్యాప్తంగా వివిధ విభాగాలలో సేవ చేస్తున్న వారికి ఈ పురస్కారాలకు ఎంపిక చేస్తారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా జాజి, మోధా శివకుమార్ ఆ పురస్కారాన్ని అందుకునేందుకు ముంబాయి వెళ్ళలేక పోవటంతో ఆ సంస్థ తన పురస్కారాన్ని కొరియర్ ద్వారా పంపడం జరిగింది.









31 డిశంబర్, 2024 మరియు 1 జనవరి 2025 తేదీలలో హైదరాబాద్ లోని పబ్లిక్ గార్డెన్స్‌లో "ఫౌండర్స్ ఫెస్ట్ ప్రదర్శన" ఏర్పాటు చేయబడింది. ఈ ప్రదర్శనరై 'అడ్వెంచర్ పార్క్' సంస్థ నిర్వహించింది. ఈ రెండు రోజుల ప్రదర్శనలో మన పల్లెసృజన ఇన్నోవేటర్లు నాగభూషణం, మోద శివకుమార్, రేపల్లె షణ్ముఖరావు, వెల్లె శ్రీనివాస్, బొడ్డు ధనుంజయ రావు, యాకర గణేష్, శశిధర్‌లు మరియు వాలంటీర్లు సుభాష్, శివ, శివకుమార్, విక్రమ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెసృజనకు చెందిన 30 కి పైగా ఇన్నోవేషన్లను ప్రదర్శించడమైనది. మొదటి రోజు కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు, ఐఎఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ పల్లెసృజన స్టాల్‌ను సందర్శించి చాలా మంది ఇన్నోవేటర్లతో మాట్లాడి వారందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్లెసృజనకు మంచి గుర్తింపు రావటంతో పాటు ఇద్దరు ఇన్నోవేటర్లకు పురస్కారం కూడా అందటం పల్లెసృజన కుటుంబానికి ఎంతో ఆనంద దాయకం.



2025 ఫిబ్రవరి, 7-9 తేదీలలో నాగపూర్‌లో ఏర్పాటు చేసిన 'అడ్వాంటేజ్ విదర్భ' కార్యక్రమానికి ఎన్.ఐ.ఎఫ్. వారు మోధా శివ కుమార్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివకుమార్ తన ఇన్నోవేషన్ పెడల్ లిఫ్టింగ్ యంత్రాన్ని కేంద్ర మంత్రి నితీష్ గడ్కారీ మరియు అతిథులు తిలకించడం జరిగింది. ఈ సందర్భంగా తన ఇన్నోవేషన్ ద్వారా నిజమైన మరియు సానుకూల మార్పును పొందేలా చేసినందుకు మోధా శివకుమార్‌ను ప్రశంసా పత్రంతో సత్కరించడం జరిగింది.



28-30 జనవరి, 2025 తేదీలలో అహమ్మదాబాద్ లో జరిగిన 5వ 'ఐసిసిఐజి' కార్యక్రమానికి పల్లెసృజన ఇన్నోవేటర్ల బృందంతో కలిసి పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు పాల్గొనన్నప్పటి చిత్రం.




జనవరి 2025 న యాదాద్రి భువనగిరి జిల్లాలోని 'ఆలేరు' లో స్థానిక చేనేత కుటుంబాలకు చెందిన మహిళలకు మగ్గంపై నేత నేయటానికి ముందు చేయవలసిన పనుల పై అవగాహన కల్పించి, మహిళలను మగవారికి తోడుగా అందించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం ప్రారంభంలో పాల్గొన్న మహిళా శిక్షకులు, 'పద్మశ్రీ' చింతకింది మల్లేశం, ఇతర చేనేత కుటుంబాలకు చెందిన వారు.

# యువత అవగాహనకై ప్రకృతిలో లభించే చెట్ల పేర్లు సంస్కృతం మరియు తెలుగు భాషల్లో

సేకరణ : పర్యావరణ వేత్త "కొమెర జాజి"



మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నేటి యువతకు చాలా వరకు చెట్ల పేర్లు తెలియటం లేదు. వాటిని పిల్లలకు తెలియజేసే వారు కూడా కరువయ్యారు. ఈ విషయం అవగాహన చేసుకున్న పర్యావరణవేత్త "కొమెర జాజి" పల్లెసృజనకు తాను సంస్కృతం మరియు తెలుగు లో సేకరించిన చెట్ల పేర్లను తెలియజేస్తున్నాడు. వీటిని మీ చిన్నారులచేత తప్పక చదివించండి. వీలైతే మీ పరిధిలో వారు అడిగిన చెట్లను చూపించండి. ఇలా చేయటం వల్ల ప్రకృతి పట్ల చిన్నారుల్లో అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో వారికి చెట్లపైన అవగాహన పెరిగి, పర్యావరణం రక్షించదానికి దోహద పడుతుంది. **- ఎడిటర్**

**(గత సంచిక తరువాయి)**

**చెట్ల పేర్లు**

| వ.సం. | సంస్కృతం | - | తెలుగు |
|---|---|---|---|
| 291. | జ్యోతిష్మతి | - | పిన్న మా వేరు |
| 292. | జ్యోత్స్న | - | చేదు పొట్ల |
| 293. | జ్వరనాశని | - | మంజిష్ట |
| 294. | జ్వరాంతక | - | నేల వేము |
| 295. | ఘుర పత్రికా | - | చాదరాసి కూర |
| 296. | ఘూవుక | - | పక్కి చెట్టు |
| 297. | తుండుక | - | చిర్రి కూర |
| 298. | తమాల | - | తమాల వృక్షము |
| 299. | తరుణీ | - | చేమంతి చెట్టు |
| 300. | తల పోటక | - | తంగేడు |
| 301. | తాంబూల పల్లి | - | తమలపాకు |
| 302. | తాంమ్ర | - | తాంమ్రము |
| 303. | తామ్రకూట | - | పొగాకు |
| 304. | తామ్రపుష్ప | - | భూచంపక |
| 305. | తామ్ర బీజ | - | ఉలవలు |
| 306. | తాల మూలీ | - | నేల తాడి |
| 307. | తాల | - | తాడి చెట్టు |
| 308. | తాలీసపత్ర | - | తెలిసపత్రి |
| 309. | తిందుకి | - | ఈడె పండు |
| 310. | తిక్త కర్కటి | - | చేదు దోసకాయ |
| 311. | తిక్త కోశాతకీ | - | చేదు బీర చెట్టు |
| 312. | తిక్తతుండికేరీ | - | చేదు బీర చెట్టు |
| 313. | తిక్త సార | - | సంద్ర చెట్టు |
| 314. | తిత్తిరి ఫలా | - | తియ్య దొండకాయ |
| 315. | తినిశ | - | నెమ్మి చెట్టు |
| 316. | తిన్త్రిణి | - | చింత చెట్టు |
| 317. | తిల | - | నువ్వులు |
| 318. | తిలక | - | తిలకపు చెట్టు |
| 319. | తీక్ష కంటక | - | వెణుతురు చెట్టు |
| 320. | తిక్ష గంధా | - | మునగ చెట్టు |
| 321. | తిక్ష వృక్ష | - | వరగోగు |
| 322. | తుంబి | - | అనపకాయ |
| 323. | తువరక | - | నీరుడి విత్తులు |
| 324. | తేజపత్ర | - | ఆకు పత్రికము |
| 325. | తోయపిప్పలి | - | బొక్కెన చెట్టు |
| 326. | త్రపు కర్కటి | - | ములు దోసకాయ |
| 327. | త్రాయమాణ | - | కలు గ్రానుక |
| 328. | త్రికంటక | - | ఎర్ర పల్లేరు |
| 329. | త్రికోణ ఫల | - | కోవిల దుంపలు |
| 330. | త్రిదంతీ | - | మహామేదా |
| 331. | త్రిపాదికా | - | హంసపాది |
| 332. | త్రిపుట | - | తెల్ల తెగడ |
| 333. | త్రివృత్పత్రా | - | గాడిద గడపాకు |
| 334. | త్వక్ సుగంధ | - | నారింజ పండు |
| 335. | త్వక్ పత్రి | - | హింగు పత్రము |
| 336. | దండోత్పల | - | సహదేవి |
| 337. | దంతచ్ఛదోపమా | - | దొండ చెట్టు |
| 338. | దంత బీజ | - | దానిమ్మ చెట్టు |
| 339. | దంత హర్షణ | - | నిమ్మపండు |
| 340. | దత్తూర | - | ఉమ్మెత్త చెట్టు |

| వ.సం. | సంస్కృతం | – తెలుగు |
|---|---|---|
| 341. | దదృఘనా | – సీమ మెట్టతామర |
| 342. | దధి పుష్ప | – కట్లే తీగ |
| 343. | దమన | – దవణము |
| 344. | దర్భ | – కుశ ధర్భగడ్డి |
| 345. | దహన | – చిత్ర మూలము |
| 346. | దహని | – చాగ నారమట్టలు |
| 347. | దళస్నుహీ | – ఆకు చెముడు చెట్టు |
| 348. | దాడిమ | – దానిమ్మ చెట్టు |
| 349. | దార్వీ | – మాను పసుపు |
| 350. | దావాగ్ని | – అగ్ని వెంరడపు చెట్టు |
| 351. | దీనా | – కక్కుపాల |
| 352. | దీర్ఘ గ్రంధి | – వెదురు |
| 353. | దీర్ఘ ఫల | – రేల చెట్టు |
| 354. | దీర్ఘ మూలిక | – ముల్లంగి |
| 355. | దీర్ఘ వల్లరీ | – వృద్ధదారు |
| 356. | దుగ్ధ తుంబి | – పాల అనబకాయ |
| 357. | దుగ్ధికా | – పిన్న పాల చెట్టు |
| 358. | దురాలభా | – చిన్న దూల గొండి |
| 359. | దుషపుత్ర | – గడ్డి ధవణము |
| 360. | దూర్వా | – గరిక వేళ్ళు |
| 361. | దేవ గంధ | – సహదేవి |
| 362. | దేవదారు | – దేవదారు చెట్టు |
| 363. | ద్రవంతి | – ఎలుక చెవికూర |
| 364. | ద్రోణ పుష్ప | – తుమ్మికూర చెట్టు |
| 365. | ధను వృక్షా | – తడ చెట్టు |
| 366. | ధవళ పాటలా | – తెల్ల కలిగొట్టు |
| 367. | ధవళోత్పల | – తెల్ల కలువ గడ్డ |
| 368. | ధాతకి | – ఆరె చెట్టు |
| 369. | ధాత్రి | – ఉసిరిక చెట్టు |
| 370. | దామర్గవం | – బీరకాయ |
| 371. | ధూసర పత్రిక | – తేలుమణి చెట్టు |
| 372. | ధ్యామకం | – కామంచి పూరి |
| 373. | ధ్యామశ్య పత్ర | – పచ్చాకు |
| 374. | నందివర్ధన | – నందివర్ధనము |
| 375. | నందివృక్ష | – నందివృక్షము |
| 376. | నక్తమాల | – కానుగ చెట్టు |
| 377. | నఖ రంజక | – గోరింట చెట్టు |
| 378. | నట మండన | – హరి దళము |
| 379. | నడ | – కిక్కిస గడ్డి |
| 380. | నదీ కాంత | – కోదాడి కాయ |
| 381. | నదీ వీరణ | – ఆవురు గడ్డి |
| 382. | నమస్కారీ | – నిద్ర గన్నిక |
| 383. | నమేరు | – సుర పొన్నపువ్వు |
| 384. | నలికా | – పగడుపు తీగె చెట్టు |
| 385. | నలికాదళ | – మదనానబ చెట్టు |
| 386. | నళ | – కిక్కిస గడ్డి |

| వ.సం. | సంస్కృతం | – తెలుగు |
|---|---|---|
| 387. | నళి నీరుహా | – తెల్ల తామర |
| 388. | నాకులీ | – విటముంగి తేగలు |
| 389. | నాగ కేసర | – నాగ కేసరములు |
| 390. | నాగ దమని | – ఈశ్వరి చెట్టు |
| 391. | నాగ బలా | – జబిలిక తీగ |
| 392. | నాగ మదనీ | – గొద్దు ఆగారక |
| 393. | నాగ రక్త | – గంగ సింధూరము |
| 394. | నాగ రముస్త | – నాగ ముస్తలు |
| 395. | నాగ వల్లీ | – తమలపాకు |
| 396. | నారదం | – నార దబ్బకాయ పండు |
| 397. | నారాయణ పియ | – పీత చందనము |
| 398. | నారికేళ | – కొబ్బరికాయ చెట్టు |
| 399. | నాల కుంకుమ | – పారిజాతపు చెట్టు |
| 400. | నింబ | – వేప చెట్టు |
| 401. | నికుంచక | – నీటి ప్రబ్బలి చెట్టు |
| 402. | నికోచక | – ఉడుగ చెట్టు |
| 403. | నిదిగధిక | – వాకుడు చెట్టు |
| 404. | నిర్గుడి | – వావిలి చెట్టు |
| 405. | నిర్వరా | – చాదరాసి కూర |
| 406. | నిశ్రేణి | – ఖర్జూరపు పండు |
| 407. | నీప | – కడిమి చెట్టు |
| 408. | నీలతరు | – కొబ్బరి చెట్టు |
| 409. | నీలతాళ | – తమాల వృక్షము |
| 410. | నీల నిర్గుండి | – నల్లవావిలి |
| 411. | నీలపుష్ప | – కట్లే తీగ |
| 412. | నీలపుష్ప | – విష్ణుకాంత చెట్టు |
| 413. | నీలాప రాజిత | – నల్ల దింతిన |
| 414. | నీలి | – నీలి చెట్టు |
| 415. | నీలోతపల | – నల్ల కలువ |
| 416. | నేత్రోపమ | – బాదము కాయలు |
| 417. | నేమీ | – నెమ్మి చెట్టు |
| 418. | నైపాలీ | – విరజాజి పుష్పము |
| 419. | న్యగ్రోధ | – మర్రి చెట్టు |
| 420. | పంచాగుళ | – ఆముదపు చెట్టు |
| 421. | పంచానన | – చేదు పొట్ల |
| 422. | పాతంగ | – పతంగి చెక్క |
| 423. | పత్ర | – ఆకు పత్రకము |
| 424. | పత్రాంగ | – రక్త చందనము |
| 425. | పత్రామ్ల | – చుక్క కూర |
| 426. | పద్మ | – తామర పువ్వు |
| 427. | పద్మ చారిణి | – మొట్ట తామర |
| 428. | పద్మ నాళ | – తెల్ల తామర |
| 429. | పద్మ పుత్ర | – పుష్కర మూలము |
| 430. | పద్మ మూల | – తామర దుంప |

(వచ్చే సంచికలో మరికొన్ని చెట్ల పేర్లు)

(మరిన్ని వివరాలకు, తప్పు ఒప్పులకు 'జాజి' గారిని సంప్రదించండి
ఫోన్ : 9908411700

49వ జాతీయ శోధయాత్ర

# తూర్పు ఉత్తర ప్రదేశ్ నుంచి అసాధారణ సందేశం!

**ఉత్తర ప్రదేశ్ లోని బల్లియా మరియు ఘజీపూర్ జిల్లాలో 20-26 జూన్, 2023 తేదీల్లో జరిగిన శోధయాత్ర 2వ భాగం**



స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**(గత సంచిక తరువాత)**

12. ఖైరాబరీ గ్రామానికి చెందిన మనోజ్ పాండే చెప్పిన దాని ప్రకారం డెంగ్యూ జ్వరం వచ్చినప్పుడు బొప్పాయి చెట్టు ఆకుల రసం కానీ, మేక పాలు కానీ త్రాగితే రక్తంలోని ప్లేట్‌లెట్‌ల సంఖ్య పెరుగుతుందట. సప్తపర్ణి ఆకుల రసం కురుపులు తగ్గటానికి, చర్మరోగ నివారణకు వాడతారట.

కానుగ చెట్టు కొమ్మలతో పళ్ళు తోముకుంటే కడుపుబ్బరానికి, జ్వరానికి పని చేస్తుందని మాత్రమే తెలుసు, కానీ చాలా మందికి వాటిని సస్యరక్షణకు కూడా వాడొచ్చు అని మా హనీబీ వారు చెప్పినప్పుడు అక్కడి జనాలు చాలా ఆశ్చర్యపోయారు.

దారిలో అమలెరాన్ గ్రామానికి చెందిన ఒక రైతు ఆనంద రామ్ మాత్రం తను వంగ పంటలో చీడపీడల నివారణకి పచ్చ గన్నేరు ఆకుల రసాన్ని వాడతానని చెప్పాడు. పిప్రకలాన్ గ్రామవాసులు పేరు తెలియని ఒక కొమ్మ తీసుకొని వచ్చి ఆ చెట్టు ఆకుల రసం తీసుకుంటే చక్కెర వ్యాధి తక్కువ అవుతుందని చెప్పగా, 'స్రిష్టి' కార్యకర్తలు ఆ చెట్టు యొక్క కొమ్మ తీసుకొని వచ్చి, వాటి పనితనాన్ని తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

ఆ ప్రాంతం మట్టికి కూడా ఔషధ గుణాలు ఉన్నాయని నమ్ముతారు అక్కడి ప్రజలు. అక్కడ నల్లని మట్టి గంగానదికి ఉత్తరం వైపుకి వెళితే బంక మట్టిగా మారి తల రుద్దుకోవటానికి, వెంట్రుకలు నునుపుగా, మెత్తగా చేయటానికి మందులా వాడతారట. అక్కడ ప్రజలు భూమిని దేవునితో సమానంగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం ఆరుద్ర నక్షత్ర కాలంలో 3 రోజులు (22 జూన్ నుంచి), చిత్త నక్షత్ర కాలంలో మూడు రోజులు (15 అక్టోబర్ నుంచి), భూదేవి బహిష్టులో ఉంటుందని, ఆ రోజుల్లో భూమికి సంబంధించిన ఏ కార్యము చెయ్యరు. ఆ తరువాతనే సాలు పనులు ప్రారంభిస్తారు. ఇటువంటి ఆచారాల వలన భూమికి కొంత విశ్రాంతి లభిస్తుంది. అదే కాలంలో మహిళలకి పనివారికి కూడా విశ్రాంతి లభిస్తుంది కదా అనిపించింది.

ఆజాపూర్ గ్రామంలో స్థానిక మొక్కల గురించి చర్చిస్తునే ఆ ప్రాంతంలో ఎవరైనా ఇన్నోవేటర్‌లున్నారా అని అడిగాము. ఎవరూ సమాధానం చెప్పలేదు. అక్కడ మేమొక గుణపాఠం నేర్చుకొన్నాం. అడగాల్సిన పద్ధతి ఇది కాదని తెలుసుకొని మేమూ కొంచెం ఇన్నోవేటివ్‌గా ఆలోచించాలని అనుకుని, మీలో ఎవరైనా విచిత్రంగా సాధారణ పద్ధతులకు భిన్నంగా ఏవైనా పనులు చేస్తుంటారా అని అడిగాం. మేము అడిగిన దాన్నే స్థానిక భాషలో 'ఉల్టీ కోపిడి' అంటారు. అప్పుడు అజోపూర్ గ్రామ ప్రజలంతా ముక్త కంఠంతో శివాజీ రావ్ అన్నారు. ఎందుకా అని ఆరా తీస్తే, అతను వారం రోజులు పులియ బెట్టిన మజ్జిగని మిరప పంటలో ఆకుముడత నివారణకు పక్కనున్న రైతులు ఎంత నిరాశ పరచినా ఆగకుండా తన పొలంలోని బెండ, బీర పంటలకు కూడా వాడి వాటికి సోకే చీడ పీడలను నివారించాడట. ఇదేం పిచ్చి పని అని అంతా అనుకుంటూ ఉంటే, కాదు ఇది మంచి సేంద్రియ పద్ధతి అని నచ్చచెప్పిన తరువాత కొందరు రైతులు మేము మీ కంపోస్టు కుప్పలపై పుల్ల మజ్జిగ పోసి చూస్తే క్రిములు చనిపోయి, వానపాముల సంఖ్య పెరిగిందని చెప్పారు పిప్రాకలాన్ గ్రామ రైతులు.

పండేర్‌పురా అమీర్‌పూర్ గ్రామానికి చెందిన కొందరు మద్ది చెట్టు ఆకులు వాపులకి, నొప్పులకి వాడతామని చెప్పారు. చాలామంది ఇతర గ్రామాలకు చెందినవారు పసుపు రంగులో ఉండే మద్దిచెక్కతో





క్రికెట్ బ్యాట్‌లను తయారు చేస్తామని చెప్పారు. మా యాత్రీకులలో కొందరు దాని ఎండిపోయిన పండ్ల రసంతో ప్రోస్టేట్ గ్రంధి వ్యాధులు, కిడ్నీకి చెందిన వ్యాధులు నయం చెయ్యవచ్చని వారికి చెప్పగా ఆశ్చర్యం గా విన్నారు. ఆ ప్రాంతంలో ఈ చెట్లు విరివిగా దొరుకుతాయి. కనుక వారు దీనిని ఇతర ఉపయోగాలకు కూడా వాడి, స్థానికంగా చిన్న ఉత్పత్తి కేంద్రం స్థాపించుకుంటారని ఆశిస్తున్నాం.

మా యాత్రలోని మొదటి సాయంత్రం ఎన్ఎన్‌డిసి వారి శిక్షణా కేంద్రంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న 32 మంది యువతులను కలిశాము. వారు మాకు జిలేబీలు, ఉల్లిపాయ పకోడీలు, మామిడి తొక్కుతో పాటు స్థానికంగా దొరికే అనేక పదార్థాలతో విందు ఏర్పాటు చేశారు. ఆ విందులో వారు హనీబీ వారి సహాయ సహకారంతో చాలా మంది యువత చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించుకొంటున్నారని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. వాళ్ళ ఉత్సాహం చూసి వారికి కొన్ని కార్యశాలలు, శిక్షణలు, ఏర్పాటు చేసి వారిచేత వెదురు బొగ్గుతో సబ్బులని తయారు చెయ్యటం లాంటిది నేర్పుతామని చెప్పాం.

నరోహి గ్రామానికి చెందిన 12 స్వయం సహాయక బృందాల మహిళలు వారు చేసిన కచోరీలు పనస ఊరగాయ, శనగపిండి దోశలు, గోధుమ హల్వా మొదలైన వాటిని ఉత్సాహంగా మాకు రుచి చూపించారు. చాలా కుటుంబాలలో భర్తలు, మగవారు బయట ఊర్లలో ఉద్యోగాలు చేస్తుండగా మహిళలు తమ తీరుబడి సమయాల్లో తమకు తోచిన తినే పదార్థాలు, పచ్చళ్ళు, ఊరగాయలు తయారు చేసి అమ్ముతూ వ్యాపారం చేస్తుంటారు. వారు మేము ఇంకేం చెయ్యగలము అని అడిగితే వారికి ఒకరితో ఒకరు పోటీ పడకుండా, కలిసి సహకరించుకుంటూ మామిడి టెంకలోని గింజలతో పొడి, ఇతర రకాల కూరగాయలతో ఊరగాయలు





చేసుకోమని సలహా ఇచ్చాం. ఎవరు దేనిలో నేర్పరులైతే వారు ఆ వస్తువు తయారు చేసుకుంటే బాగుంటుందని చెప్పాం.

గోడీఖాస్ గ్రామంలో ఎఫ్.పి.ఓ. వారు ఊర్మిళాదేవీ ఎంటర్ ప్రైజెస్ స్థాపించి, శ్రేష్ఠమైన ఆవనూనెను "శ్రీప్రాణ్" పేరిట తయారు చేస్తున్నారు. స్థానికంగా పలుకుబడి గల ఊర్మిళా దేవి మాకు ఇప్ప పూలతో చేసిన పూర్నాలు, బూరలు రుచి చూపించింది. ఎండిన ఇప్ప పూలను రాత్రంతా నీటిలో నానబెట్టి ముద్దగా రుబ్బి దానిలో పిండి లేదా పప్పు కలిపి పూరీలు, పుర్నాలూ తయారు చేస్తారట. చాలా రుచిగా ఉన్నాయి.

చాలాచోట్ల మహిళలు మా కార్యక్రమాల్లో తక్కువగా పాల్గొన్నారు. దానికి భిన్నంగా మాకు పందేర్‌పూర్ అమరాపూర్‌లో 15 మంది మహిళలు ఒకేచోట గుమికూడి ఉండటం ఆనందం కలిగింది. వారు కూడా వారికి తెలిసిన జ్ఞాన కణికలు మాతో పంచుకున్నారు. వారు ఎంతో కుతూహలంతో మేము ప్రదర్శించిన పోస్టర్‌లు చదువుతూ ప్రశ్నిస్తూ వుంటే, మాలో యువకుడైన ఒక ఇన్నోవేటర్ వారికి ఒక వర్క్‌షాపు ఏర్పాటు చేసి, పర్యావరణ రక్షణకి తోడ్పడేలా ఆలయాలలోని వ్యర్థ పదార్థాలతో అగరు వత్తులు, ఆవు పేడతో రాఖీలు, బొమ్మలు చేయటం నేర్పించటానికి ముందుకు వచ్చారు. వారు కూడా సిగ్గు పడుతూ చిరునవ్వుతో ముసుగులో నుంచి తమ సంసిద్ధత తెలియ జేశారు. త్వరలో అక్కడ ఈ వర్క్‌షాపు జరగనున్నది.

మేము ఈ యాత్ర మొత్తంలో మహిళలను ఎక్కువగా పాల్గొనేలా చెయ్యాలని ప్రయత్నించాం. ఈ ప్రాంతంలో మగవారు ఆడవారు ఒక వేదిక లేదా ప్రదేశంలో కానీ కలిసి ఉండటం ఆచారం కాదు. దానికని మేము మగవారినీ, ఆడవారినీ వేరువేరుగా కలవటం మేలని ఆ విధంగా ఏర్పాటు చేసుకొన్నాం.

'ఏక్తా' పరిషత్తు ఉద్యమం వారికి ఎన్నో పాదయాత్రలని ఏర్పాటు చేసిన మృత్యుంజయ భాయ్ మాతో ఇది ఎన్నో శతాబ్దాల నుంచి ఉన్న కట్టుబాటని, దీనిని ఒక్కసారిగా చెరిపెయ్యటం కష్టమని చెప్పాడు. 'కున్నన్' గ్రామంలో వారింటికి మేము వెళ్ళినప్పుడు ఆయన భార్య అర్చనాదేవి. తను తన భర్తతో కలిసి పాదయాత్రలో పాల్గొనే సాహస చెయ్యటానికే చాలా సంవత్సరాలు పట్టిందని చెప్పారు. ఈ రకమైన కొత్త ఆలోచన తరవాతి తరానికి త్వరగా వచ్చినట్లయింది. అందుకేనేమో వారి కూతురు, కొడుకు మా యాత్రలో అందరికన్నా ఉత్సాహంగా సంశయం లేకుండా పాల్గొన్నారు. యాత్రలో అందికన్నా చిన్నవాడైన 'కబీర్' నిత్య జీవితంలో తారసపడే చిన్న విషయాల నుంచి కూడా మనం ఎన్నో నేర్చుకోవచ్చు అన్న సత్యాన్ని యాత్రికుల దృష్టికి తీసుకొని వచ్చాడు. ●

**(వచ్చే సంచికలో మరికొన్ని విశేషాలు)**

# 'అడవి పుత్రుడు' కొమెర జాజి తో అడుగులు వేస్తూ .... నల్లమల అడవిలో ఒకరోజు....





'అడవి పుత్రుడు' కొమెర జాజి (కొమెర అంకారావు) గురించి పల్లెసృజన పాఠకులతో పాటు, యూట్యూబ్ లాంటి సోషియల్ మీడియా చూస్తున్న దాదాపు అందరికీ తెలుసు. ఇతను ఉదయం లేచింది మొదలు అడవిని ఎలా రక్షించాలి, అందులోని జీవరాసులు, చెట్లకు ఏ విధంగా తన సహాయ సహకారాలు అందించాలి. కేవలం తమ విలాసాల కోసం అడవిలోకి వచ్చి, అక్కడే మద్యం సేవించి, ఆ సీసాలు, ప్లాస్టిక్ బాటళ్ళు, కవర్లు అక్కడే పారవేసి పోవటం వల్ల అడవిలో తిరిగే జంతువులు, పక్షులు వాటిని తినటం వల్ల అనారోగ్యానికి గురై చనిపోతున్నాయి, అంతరించి పోతున్నాయి అని గ్రహించి, వాటిని తానే శుభ్రం చేయాలి, జంతువులకు, పక్షులకు తోడ్పడాలి అనుకున్నాడు. దాదాపు ప్రతి రోజూ ఒక సంచిని భుజాన వేసుకుని అడవిలో తిరుగుతూ పోకిరి మూకలు పారవేసిన సీసాలు, ప్లాస్టిక్ కవర్లను సంచిలో వేసుకుని, వాటిని అడవి బైటకు తీసుకు వచ్చి, ప్లాస్టిక్ ఏరుకునే వాళ్ళకు ఇస్తూ, అడవిలోని పశు పక్ష్యాదులకు జీవం పోస్తున్నాడు జాజి. గత 25 సంవత్సరాల నుండి నిరంతరం ప్రకృతి సేవలో నిమగ్నమయ్యాడు జాజి.

అతని గురించి మనం మన పత్రిలో వ్రాయటం, అతని కృషికి తగ్గ గుర్తింపు రావాలన్న ఉద్దేశ్యంతో అతనికి వివిధ రకాల పురస్కారాలు అందేందుకు దరఖాస్తు చేయటం లాంటి పనులు చేస్తున్న "పల్లెసృజన" కుటుంబ సభ్యులకు ఒక రోజు ఒక ఆలోచన వచ్చింది. అసలు జాజి అడవిలో చేస్తున్న ప్రయాణం ఒకరోజు ప్రత్యక్షంగా చూడాలి అనుకుని 2024 డిశంబర్, 21న కొమెర జాజి వద్దకు (కారెంపూడి) పల్లెసృజన నుండి 6 మంది సభ్యులు, ఇతర ప్రాంతాల నుండి 9 మంది వాలంటీర్లు బయలు దేరారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 11 గంటలకు కారెంపూడి చేరుకున్నారు. అక్కడి నుండి అడవిలోకి జాజితో పాటుగా ప్రయాణం మొదలు పెట్టారు. ఈ బృందం అడవిలోకి అడుగు పెట్టగానే అందులోని చెట్లు, పుట్టలు, కొండ కోనలు వీరిని ఆహ్వానిస్తున్న అనుభూతిని పొందారు యాత్రీకులు.



సుమారు 5–6 గంటల సమయం జాజితో కలిసి అడవిలో నడిచారు అందరూ. అడవిలో గల చెట్ల పేర్లు, వాటిని అల్లుకు పోయిన తీగల పేర్లు, ఔషధ మొక్కల పేర్లు, అవి ఏవిధంగా మనిషి రోగాల నివారణకు ఉపయోగ పడతాయో యాత్రీకులకు వివరించాడు జాజి. అడవి నియమాలు, తాను అడవి లోని చెట్లను ప్రేమించే విధానం గురించి తెలియజేశాడు. అడవి స్వతహాగా దానంతట అదే పెరుగుతుంది అనీ, దాన్ని మనం సహాయ పడవలసిన అవసరం లేదని, దాన్ని పాడు చేయకుండా ఉండటమే మనం చేయాల్సిన పని అని అన్నాడు. తానే ఒక సైనికుడిగా మారి అడవిని, అందులోని జంతువులు, పక్షులకు ఆటంకంగా మారుతున్న ప్లాస్టిక్ కవర్లు, సీసాలను ఏరటం యాత్రీకులు కూడా చేయడం అతనికెంతో ఆనందాన్ని ఇచ్చింది అన్నాడు కొమెర జాజి.

కొమెర జాజి అడవికి తండ్రిలా వ్యవహరిస్తుంటే ఇంత వరకు ఈ మేలు చదివాం, వీడియోలు చూశాం కానీ, ఈ అడవి తండ్రి వెంట ఇన్నాళ్ళకు కలిసి అడవిలో పయనించే అవకాశం కలిగింది. అతనితో పాటు అతని తపనను మేమూ పంచుకున్నాము. మేము కూడా చెట్లను స్పృశిస్తూ పరవశించాము అని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు యాత్రీకులు. ఈ యాత్రలో పాల్గొన్న వారిలో విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు అందరూ తమ తమ అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు.

పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో, కొమెర జాజి గారి అడుగు జాడల్లో నల్లమల అడవిలో మా యాత్ర ఎంతో ఆహ్లాదంగా సాగిందని, ఈ యాత్ర మా జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోతుందని అన్నారు యాత్రలో పాల్గొన్న వారు. తను చేస్తున్న పనిని విని ఆస్వాదించడమే కాకుండా, నాతో కలిసి ఒకరోజు అడవిలో 15 మంది సభ్యులు నడవటం,అడవిని గురించి తెలుసుకొని తామూ నే దైనందిన కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందం కలిగించడమే కాదు, నేను చేస్తున్న పని ఇంతమందికి స్ఫూర్తిని అందించడం ఎంతో సంతోషం అన్నాడు కొమెర జాజి.

# పల్లె జ్ఞానం

- 'హనీబీ' ఆంగ్ల సంచిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**పశువులలో అతిసార నివారణకు చింతచెట్టు బెరడుతో చికిత్స:**
ఇన్నోవేటర్ : **మంజులాబేన్ ధీరూభాయ్ పటేల్**, భాతా ఫల్యా గ్రామం, ఖాట్వాడీ పోస్ట్ & తాలూకా, వాల్సర్ జిల్లా – 396 385, గుజరాత్.

కొన్నిసమయాలలో పశువులు పచ్చిమేత ఎక్కువగా తిని, లేదా చెడిపోయిన, కుళ్ళిపోయిన పదార్థాలు తిన్న ఫలితంగా అతిసార వ్యాధి బారిన పడుతుంటాయి. పేడలో దుర్భరమైన వాసన వుండి, రక్తము, చీము కూడా పడుతూ వుంటాయి. దీనికి సరియైన జాగ్రత్త తీసుకోకపోతే పశువు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. దీని నివారణకై మంజులా భేన్ చింతచెట్టు బెరడును వాడుతుంది. ఆమె 500 గ్రా. చింతచెట్టు బెరడును తీసుకుని బాగా ఎండబెట్టి, కాల్చి బూడిద చేస్తుంది. రెండు స్పూన్ల ఈ బూడిదలో 300 మి.లీ. నీటిని జోడించి, బాగా కలిపి పశువుకి రోజుకి రెండుసార్లు చొప్పున రెండు రోజులపాటు తాగిస్తుంది. దీంతో మంచి ఫలితం ఉంటుంది. తానీ పద్ధతిని తన తండ్రివద్ద నేర్చుకున్నానని, ఇప్పటికీ ఇదే వాడుతున్నానని చెప్పారామె. వైద్యం జరుగుతున్నపుడు పశువుచేత ఏవిధమైన పచ్చిదాణా తినిపించకూడదు. నీరు మాత్రం సమృద్ధిగా తాగిస్తూ వుండాలని జాగ్రత్తలు చెప్పిదామె.



**2. పశువు తిరిగి చూలుకు రాకపోతే నెమలి ఈకతో వైద్యం:**
ఇన్నోవేటర్ : **కాంజీభాయ్ ధాన్‌జీ ఠాకూర్**, టోరారా గ్రామం, హార్జీ తాలూకా, పాతాన్ జిల్లా. గుజరాత్.

ఒకసారి ఈనిన పశువులు ఒక్కొక్కప్పుడు రెండవసారి చూలుకు రావటం ఆలస్యమవుతూ వుంటుంది. ఇటువంటి సందర్భాలలో తాను చెప్పిన చిట్కా వాడితే మంచి ఫలితం ఉంటుందని అంటున్నారు కాంజీభాయ్. నెమలి ఈకలోని వెంట్రుకల కొసభాగాలను కత్తిరించి, సజ్జ రొట్టెలలో చుట్టి పశువుచేత తినిపించాలి. ఇలా ఒక్కసారి మాత్రమే చేయాలి. దీనివలన పశువు తిరిగి చూలుకు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయి.



ఈ పద్ధతిని మేమూ పరీక్షించి సఫలీకృతమైనామని చెప్పున్నారు ప్రతాప్‌జీ ఠాకూర్, కాలోజీ ధాంజీ ఠాకూర్, కానాభాయ్, ఖేంగాభాయ్, బార్వాద్‌లు.

**3. వంగ తోటలో ఆకుముడత పురుగు నివారణ:**
ఇన్నోవేటర్ : **ముఖేష్ భాయ్ అమతాభాయ్ రబారీ**, బిలియా గ్రామం, సిద్ధాపూర్ తాలూకా, పాతన్ జిల్లా. గుజరాత్.

వంగ తోటల్లో ఆకుముడత పురుగు పెద్ద సమస్యగా వుంటుంది. వాతావరణం మబ్బుగా వుండి, మంచు ఎక్కువ కురుస్తున్న ప్రదేశాలలో రసం పీల్చే పురుగు చేరి అది ఆకుముడతకు దారి తీస్తుంది. దీనివలన వంగచెట్టు కొత్త ఆకులు వేయలేదు, చిగురు కూడా రాదు. పర్యావసానంగా పంట దిగుబడి దెబ్బతింటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ముఖేష్ భాయ్ రాబరి జిల్లేడు, గన్నేరు, గోమూత్రం, నాచు ఉపయోగించి స్వంతంగా క్రిమి సంహారణిని తయారు చేసుకుంటారు.

దీనికై రెండున్నర కిలోల జిల్లేడు ఆకులు, రెండున్నర కిలోల గన్నేరు ఆకులను మెత్తగా నూరి, ఆ మిశ్రమానికి 10



లీటర్ల నీటిని జోడించి సన్నని సెగపై చాలాసేపు మరగనివ్వాలి. చల్లారిన తర్వాత ఆ మిశ్రమంలో రెండున్నర లీటర్ల గోమూత్రము, ఒక కిలో నాచు/ పాచిని కలిపి 24 గంటలసేపు కదలకుండా ఉంచాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, 500 మి.లీ. ద్రావణాన్ని పంటపై పిచికారి చేయాలి. ఈవిధంగా రోజు విడిచి రోజు చొప్పున ఆరు రోజులపాటు పిచికారి చేయాలి. దీనితో పంటను ఆశించిన తెగులు నశించి కొత్త చిగురు వేసి పంట పూతకు వస్తుంది.

చుట్టుప్రక్కల రైతులు కూడా ఈ ద్రావకం పనితీరును గమనించి తాముకూడా తమ పంటల్లో ఉపయోగిస్తున్నారు. నాచు, పాకుడుని తప్పనిసరిగా 24 గంటలసేపు ద్రావకంలో తప్పనిసరిగా ఉంచటం వలన మంచి ఫలితాలు వస్తాయట. పిచికారి చేసేటపుడు ఆకులన్నీ పూర్తిగా తడిసేలా తగు జాగ్రత్త తీసుకోవాలి

ముఖేష్‌భాయ్ రాబరీ తనకున్న 5 బీగాల పొలంలో కూరగాయలే కాక, పశువులకై గడ్డిని కూడా పెంచుతూ వుంటాడు. మూడవ తరగతి వరకే చదువుకున్న ఇతను గత 32 సంవత్సరాలుగా కొత్త విషయాలను తెలుసుకుని సేంద్రియ వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంభిస్తూ వుంటాడు.

**4. కాయగూరల్లో తెల్లదోమ నివారణకి మందు:**

ఇన్నోవేటర్ : **మంగళ్‌భాయ్ ధాంజీభాయ్ బోయా**, తనికీ గ్రామం, ధర్మపూర్ తాలూకా, వాల్సాద్ జిల్లా. గుజరాత్.

ప్రత్యేకించి చలికాలంలో చిక్కుడు మరియు ఇతర కూరగాయల పంటలకి తెల్లదోమ, రసంపీల్చే ఆకుపచ్చ పురుగులు సాధారణంగా ఆశిస్తూ వుంటాయి. నీరు పెట్టే పంటలపై ఇవి ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. ఇటువంటి పరిస్థితి వచ్చినపుడు మంగళ్‌భాయ్ బూయా వేపాకు, గోమూత్రంతో క్రిమి సంహారక మందును తయారు చేసుకుంటూ వుంటాడు. ఆయన తన వంగ, చిక్కుడు పొలంలో



ఈ తెల్లదోమ, రసంపీల్చే పురుగులు కనిపించినపుడు 5 కిలోల సన్నగా తరిగిన వేపాకులను 10 లీటర్ల నీటిలో కలిపి 2 రోజులు మురగబెడ్తాడు. ఆ తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి ఈ మిశ్రమానికి 3 లీటర్ల గోమూత్రాన్ని కలుపుతాడు. 3 లీటర్ల ఈ ద్రావకాన్ని పురుగు సోకిన పంటపైన మూడురోజులకొకసారి చొప్పున పురుగు నశించేంత వరకు పిచికారి చేస్తూ వుంటాడు. కొన్ని సమయాలలో ఈ రసంపీల్చే పురుగు నాశనం కాక పోయినా, ఈ మందులోని చేదు రుచి వలన అవి మొక్కల రసాన్ని పీల్చటం మానేస్తాయి. గోమూత్రం క్రిమి సంహారిగానే కాకుండా మొక్క ఎదుగుదలకు కూడా సహాయకారిగా వుంటుంది. ఈ పద్ధతిని తమ పూర్వీకులనుండి పాటిస్తున్నామని చెప్తున్నాడు మంగళ్‌భాయ్.

## గ్రామీణ సృజనాత్మక శక్తికి వేదిక 'పల్లెసృజన'

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా మాకు పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. మీ సమస్యలను 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మన సమస్యలు బహిరంగ వేదికపై పెట్టి సమాజం నుండి పరిష్కారాలను ఆహ్వానించడమే 'పల్లెసృజన' ఉద్దేశ్యం. అందరూ సహకరించి ఈ గ్రామీణ సృజనాత్మక శక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. **- ఎడిటర్**

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం



దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.

**హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.**
**ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.**

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

**77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.**
**ఫోన్ : 040-49253096, సెల్ : 96528 01700.**

# పూల వ్యాపారులకు వరం 'పూల దండలు కుట్టే యంత్రం'

## శ్యాంబాబు వినూత్న సృజన




ఆంధ్రప్రదేశ్ లోని నిడదవోలుకు చెందిన 'మోర్త శ్యాంబాబు' అనే 34 సంవత్సరాల యువకుడు ఇంటర్మీడియట్ తర్వాత 'ఫైనల్ ప్రాజెక్టు'లకు సంబంధించిన ఒక ఇన్స్టిట్యూట్‌లో ఉద్యోగం చేస్తూ, ఓపన్ యూనివర్శిటీలో 'బిఎస్‌సి (యంపిసి)' చదివాడు. 7 సంవత్సరాల పాటు ఆ సంస్థలో పని చేసిన తర్వాత 'పాజిబుల్ & టెక్' సంస్థలో చేరటం జరిగింది. ఈ సంస్థ ఇడ్లీ, పూరీ, పానీ పూరీ తయారు చేసే యంత్రాలు తయారు చేస్తుంది. అలా కొన్ని రోజులు పని చేసిన తర్వాత అతనికి ఒక ప్రమాదం జరిగి అతని మోకాలి చిప్పకు గాయం కావటంతో ప్రతిరోజూ ఆఫీసుకు వెళ్ళలేని పరిస్థితుల్లో ఉద్యోగం మానేశాడు.

ఒకరోజు హైదరాబాద్ లోని ఖైరతాబాద్‌లో గల తమ మిత్రుని వద్దకు వెళ్ళి వస్తుండగా, అక్కడ గల  రైల్వే గేటు మూసి ఉండటంతో మోటార్ సైకిల్ ఆపుకుని అటూ ఇటూ చూస్తూ ఉండగా ఒక సంఘటన అతని మనస్సును కలచివేసింది. అది అక్కడ ఉన్న పూల మాలలు అమ్మే షాపులో ఒక తల్లీ కూతురి మధ్య జరుగుతున్న సంభాషణ (ఒకవిధంగా వాగ్వాదం) అతన్ని ఆలోచింపజేసింది.

సాధారణంగా చాలా మంది పూలను దండగా కుట్టి అమ్మటం పెద్ద కష్టమైన పనేమీ కాదు అన్న అపోహతో ఉంటారు. ఇంట్లో ఆడ వాళ్ళు తమ తలలో పెట్టుకునేందుకు పూలు కుట్టుకోవటం పెద్ద పనేమీ కాకపోవచ్చు. కానీ పూలదండలను అమ్మే వారు చాలా సేపు కూర్చొనే వుండి పూలు కుట్టాల్సి ఉంటుంది. చాలాసేపు కూర్చోవటం వల్ల వారికి త్వరగా నడుము నొప్పి రావటం వల్ల చాలామంది పూలమ్మే వాళ్ళు వంగిపోయి నడుస్తూ ఉంటారు గమనించండి. పైగా ప్రస్తుతం మారుతున్న కాలంలో పూలు ఎక్కువసేపు తాజాగా కనిపించేందుకు కొందరు వ్యాపారులు ఆ పూలపైన కొన్ని రసాయనాలు కూడా చల్లటం వల్ల, వీళ్ళు ఎక్కువ సమయం పూలు కుట్టటం వల్ల రసాయనాలు చల్లిన పూలను చేతితో ఎక్కువసేపు ముట్టుకుంటూ ఉండటం వల్ల వాళ్ళ చేతి వేళ్ళు ఉబ్బిపోయి ఉంటాయి. పైగా ఎక్కువసేపు కూర్చొని పూలు కుట్టడం వల్ల వచ్చే నడుం నొప్పుల నుండి ఉపశమనం పొందేందుకు మహిళలు కొన్ని శక్తినిచ్చే పానీయాలు త్రాగటం, పురుషులైతే ఆ రోజు పని అయిపోయిన తర్వాత మద్యం సేవించటం లాంటి పనుల వల్ల వారి ఆరోగ్యం కూడా క్షీణించి పోవటం గమనించాడు శ్యాంబాబు.

ఇంత కష్టమైన పనికి ఇంత అభివృద్ధి చెందిన సమాజంలో ఒక యంత్రం అంటూ ఏదీ లేదా అని తనఅకున్న పరిజ్ఞానంతో ఇంటర్‌నెట్ లో తక్కువ ధరలో అందుబాటు అయ్యేలా ఏదైనా పూలు కుట్టే యంత్రం ఉందేమో అని వెతికాడు. కానీ, ఎక్కడా అతనికి ఇలాంటి యంత్రం కానీ, లేదా యంత్రానికి సంబంధించిన ఏదైనా వ్యాసం కానీ లభించలేదు. అంటే పూలు కుట్టే యంత్రం ఎక్కడా లేదు అని తెలుసుకుని వీళ్ళ కష్టాన్ని దూరం చేసేందుకు పూలు కుట్టే ఒక చిన్న యంత్రం తయారు చెయ్యాలి అనుకున్నాడు.

తనకున్న పరిజ్ఞానంతో ఆ యంత్రాన్ని ఎలా చెయ్యాలో ఆలోచించి మొత్తానికి ఒక నమూనా సిద్ధం చేసుకున్నాడు. ఇక యంత్రం తయారు చెయ్యాలంటే కొంత డబ్బు అవసరం. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అతనికి డబ్బు ఏర్పాటు చేసుకునే అవకాశం లేదు కాబట్టి ఎక్కడైనా కొంత అప్పు చేసి అయినా సరే ఈ యంత్రాన్ని తయారు చెయ్యాలని తమకు పరిచయం వున్న వారి వద్ద నుండి 2 లక్షల దాకా ఈ యంత్రం తయారు చెయ్యటం కోసం అప్పు చేయవలసి వచ్చింది. మొత్తానికి ఒక యంత్రం అయితే తయారు చేయ గలిగాడు. కానీ, దీన్ని మార్కెట్‌లోకి పంపడం ఎలా? ఇలాంటి పూలు కుట్టే యంత్రం ఒకటి

తయారైంది అని సమాజానికి తెలియజేయటం మంచిది అనుకుంటున్న సమయంలో 'సుమన్ టీవీ' వాళ్ళకు తెలియజేయగా వాళ్ళు శ్యాంబాబు తయారు చేసిన పూలుకుట్టే యంత్రాన్ని ఒక వీడియో చేసి 'యూట్యూబ్' లో ప్రచారం చెయ్యగా చాలా మంది ఆ వీడియోను చూసి, దాదాపు 700 దాకా ఆర్డర్లు అయితే వచ్చాయి. కానీ, అన్ని యంత్రాలను తయారు చెయ్యాలంటే చాలా పెద్ద మొత్తంలో డబ్బు అవసరం ఉంది కదా అని ఆలోచనలో పడ్డాడు శ్యాంబాబు.

తన పెట్టుబడికి అవసరమైన డబ్బు సంపాదించే శక్తి తనకు లేకపోవటం, ఆ వీడియో చూసిన వాళ్ళ వద్ద నుండి ఫోన్లు రావటం తన మిత్రులు గ్రహించి, ఇలా ఊరికే ఉంటే బావుండదు, కనీసం కొన్ని యంత్రాలను తయారు చేసి ఒక్కో ప్రాంతానికి ఒక్కో యంత్రం పంపితే వాటి ద్వారా ప్రచారం లభించి, నీకు అడ్వాన్సు రూపంలో కొంత డబ్బు వచ్చే అవకాశం ఉంటుంది కదా అని తామే కొంత డబ్బు ఏర్పాటు చేసి ఇతనికి అందించారు. తాను మొదట తయారు చేసిన యంత్రాలను మూడింటిని తయారు చేసి ఒకటి హైదరాబాద్, ఒకటి కోయంబత్తూరు, మరొకటి బెంగుళూరుకు సరఫరా చేశాడు.

ఈ యంత్రంపైన పని చెయ్యటానికి ఎటువంటి శిక్షణ అవసరం లేదు. కేవలం రెండు మూడు గంటల సేపు దానిపైన పని చేస్తే చాలు మహిళలు, చిన్న పిల్లలు కూడా ఈ యంత్రం ద్వారా పూల దండలను తయారు చేయవచ్చు. పూలను యంత్రానికి అందించే వ్యక్తి సామర్థ్యాన్ని బట్టి రోజుకు రెండు మూడు గంటల పని చేస్తే చాలు 10 నుండి 20 మీటర్ల పొడవు గల దండను తయారు చేయవచ్చు. ఇలా





చేయటం వల్ల పూల వ్యాపారం చేసే వారికి ఎంతో ఖర్చు తగ్గటమే కాకుండా త్వరగా, నాణ్యంగా పూల దండలు తయారు చేసుకోవచ్చు.

ప్రస్తుతం వాడుతున్న వారు కూడా రోజుకు తమ వ్యాపారాన్ని బట్టి 15 నుండి 20 మీటర్ల పొడవు దాకా పూలను ఈ యంత్రం ద్వారా దండలు అల్లుకుంటున్నారు. తాను మొదట తయారు చేసిన యంత్రానికి ఇంకా కొన్ని మార్పులతో అభివృద్ధి చేయటం కూడా జరిగింది. ఇప్పటి వరకు తాను తయారు చేసింది సెమీ ఆటోమేటిక్ యంత్రం. అంటే ఈ యంత్రానికి దండకు అవసరమైన రెండు–నాలుగు పూలను అందిస్తూ ఉండాలి. ఆ పూలను యంత్రంలో పెట్టిన వెంటనే అది దానంతట అదే కుట్టేస్తుంది. ఇప్పటికే ఈ యంత్రాలకు చాలా ఆర్డర్లు ఉన్నాయట. ఇంకా రాష్ట్రంలోనే కాకుండా, దేశంలోని చాలా రాష్ట్రాల నుండి కూడా తమకు ఆ యంత్రం కావాలని ఫోన్లు వస్తూనే ఉన్నాయట.

ఎద్దైనా ఒక సంస్థ లేదా ప్రభుత్వం లేదా సహాయ సంస్థలు తనకు ఆర్థిక సహాయం చెయ్యగలిగితే ఈ యంత్రాలను తయారు చేసి అందించాలని కోరుతున్నాడు శ్యాంబాబు. ఇప్పుడు తయారు చేసిన యంత్రం ఖరీదు రూ. 40 వేల దాకా ఖరీదు ఉంటుందని, తనకు ఆర్థిక తోడ్పాటు లభిస్తే ఆటోమేటిక్ యంత్రాన్ని కూడా తయారు చెయ్యగలను అని అంటున్నాడు. భారత దేశంలోని ప్రతి పట్టణానికి ఈ పూలు కుట్టే యంత్రం అవసరం ఎంతో ఉందని, దీన్ని అందించ గలిగితే ఎంతో మంది పూలు కుట్టే వారి ఆరోగ్యాన్ని సంరక్షించటంతో పాటు, వారి సమయాన్ని కూడా ఎంతో ఆదా చేసినట్లు అవుతుందని అంటున్నాడు శ్యాంబాబు.

దారిలో పోయేటప్పుడు ఎవరో కష్టపడుతుంటే చూసి మనకేం లే అనుకోకుండా వారి కష్టానికి ఒక తోడు చెయ్యాలన్న ఉద్దేశ్యంతో పూలు కుట్టే యంత్రాన్ని తయారు చేసిన శ్యాంబాబును అభినందిస్తూ, ఇతని యంత్రానికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేందుకు ఈ ఇన్నోవేషన్‌ను సమాజంలో విస్తరింపజేసేందుకు పూర్తిగా సహకరిస్తుంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ శ్యాంబాబు, ఫోన్ : 70754 76701**

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

## జాతీయ 14 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 14వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు** గొప్ప ఇన్నోవేటర్‌కు **లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. **10,000లను** వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి **తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2025** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**

**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**

**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**

**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**

**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

**దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2025**

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-40253096)** సంప్రదించండి.

# ఎన్.ఐ.ఎఫ్. వారి ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ (ఫైన్ - 2023) పురస్కారాలు




ఎన్.ఐ.ఎఫ్. వారి జాతీయ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో విజేతలకు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 10 నుండి 13, 2023 వరకు రాష్ట్రపతి భవన్ లోనే జరిగిన "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్ – 2023)" ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అందులో బహుమతులు పొందిన అనేక మంది ఇన్నోవేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు పొందిన కొందరి వివరాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

## ఇనుప చువ్వలను కత్తిరించి వొంచే యంత్రం :

రాష్ట్రస్థాయి పురస్కారం

**జలంధర్ కుమార్** (32), నవడా, బీహార్.



చాలా సంవత్సరాలుగా వెల్డర్‌గా పని చేస్తున్న జలంధర్ కుమార్‌కి సాంప్రదాయ పనిముట్లు వాడి వాడి విసుగు వచ్చి, త్వరగా, సులభంగా పని చెయ్యటానికి అనువుగా ఉండే పరికరాలు కనిపెట్టాలని అనిపించింది. ఎంత కాలం సుత్తితో పని చెయ్యటం 'ఏదైనా చేసి చూపించాలి' అనుకొన్నాడు. ఎంతో శ్రమించి ఖచ్చితమైన కొలతలతో కత్తిరించి, వొంచి, డ్రిల్ చేసి, మోడలింగ్ చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఇది గృహ నిర్మాణ పనివారికి, మెకానిక్‌లకీ, ఫ్యాబ్రికేటర్ లకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీనితో వారు ఖర్చును, సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఈయన ప్రదర్శించిన యంత్రం ఎందరినో ఆకర్షించింది.

ఒక్క హార్స్‌పవర్ మోటారుతో పని చేసే ఈ యంత్రం 10 మి.మీ. ఇనుప కడ్డీలను కేవలం 5 సెకండ్లలో కత్తిరించ గలదు. నలుగురు చేసే పనిని ఈ యంత్రం ఒక్కటే చేస్తుంది. ఈ యంత్రం తయారు చెయ్యటానికి అతనికి నెల రోజులు పట్టింది. దీని ఖరీదు రూ. 60 వేల వరకు ఉంటుంది.



ఇదే కాక అతని వద్ద ఇంకా 3 రకాల యంత్రాలు కూడా ఉన్నాయి. అందులో ఒకటి 25 మి.మీ. ఇనుప కడ్డీలను కత్తిరించ గలదు, అదే విధంగా 25 మి.మీ. వ్యాసంగల కన్నాలు కూడా డ్రిల్ చేయ గలదు. ఈ యంత్రానికి 75 రకాల డిజైన్‌లు 'డై'ల సహాయంతో చేయ వచ్చు. ఇది గ్రిల్ పనివాళ్ళకి చాలా ఉపయోగ కరంగా ఉంటుంది. 90 డిగ్రీల మోల్డ్ లను కూడా చేసుకోవచ్చు.

నిర్మాణ రంగంలోను మరియు ఇతర ఇనుముతో పని చేసే వారికి ఎంతో సహాయకారిగా ఉంటుంది.

నిర్మాణ రంగంలోని పనివారికి, ఇనుముతో పని చేసే వారికి ఎంతో సహాయకారిగా ఉండే ఈ యంత్రాలను కనుగొన్న జలంధర్ కి

ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023 లో రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు.

**అధిక దిగుబడినిచ్చే కాలీఫ్లవర్ (సొనాలి):**

రాష్ట్రస్థాయి పురస్కారం

**ముఖేష్ కుమార్ సింగ్** (39), మరియు

**రాజ్‌మనీ సింగ్** (45), వైశాలి, బీహార్.

బీహార్ రాష్ట్రంలోని, వైశాలికి చెందిన ముఖేష్ కుమార్ సింగ్, రాజ్‌మనీ సింగ్ సోదరులు 'సొనాలీ-45' పేరిట కొత్తరకం కాలీఫ్లవర్‌ని ఆవిష్కరించారు. ఇది కేవలం 75 రోజుల్లో కాపుకి వస్తుంది. మంచి పూలు ఉండి, సాధారణం కన్నా ఎక్కువ బరువు ఉండి (ఒత్తుగా గుత్తులుగా ఉండటం వలన) చక్కని రుచితో ఉంటాయి. సుమారు 16 ఆకులుండి, ఎకరానికి 60-110 క్వింటాళ్ళ దిగుబడినిస్తాయి. దాదాపు 10 సంవత్సరాలు ఎంపిక పద్ధతిపై దీనిని అభివృద్ధి చేశారీ సోదరులు. మొదట్లో వీరిరువురూ తోచిన పద్ధతిలో ఎంపిక చేసుకొనేవారు. కానీ, అనుకోకుండా వీరి ఊరికి ఒక వ్యవసాయ ప్రొఫెసర్ వచ్చి, వారి విశ్వ విద్యాలయం అభివృద్ధి చేసిన కొన్ని కాలీఫ్లవర్ విత్తనాలనివ్వడం, వాటిని వాడండని చెప్పారు. ఆయన వెడుతూ వెడుతూ మంచి రకాన్ని ఏ విధంగా ఎంపిక చెయ్యాలో వివరించి వెళ్ళారు. దీనితో ఈ సింగ్ సోదరులు ఇద్దరికీ మంచి అవకాశం దొరికింది. తాము ఇంతకు ముందు చేస్తున్న పనినే ఇంకా శాస్త్రీయ పద్ధతిలో చేసే అవకాశం వచ్చింది. ఆపైన వారు స్థానిక వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రయోగ శాలతో కలిసి తాము అనుకునే మంచి కాలీఫ్లవర్ విత్తనాలని కనిపెట్టటంలో ఇంకా ఉత్సాహంగా పని చెయ్యటం, పరీక్షించటం ప్రారంభించారు.




ఒకవిధంగా వీరిది సాంప్రదాయ కాలీఫ్లవర్ వ్యవసాయ దారుల కుటుంబం అనవచ్చు. వీరి తండ్రి కూడా కాలీఫ్లవర్‌నే పండించే వారు. వీరి పరిశోధన పూర్తి అయిన తరువాత ఎంపిక చేసిన రకానికి ఈ సోదరులలో ఒకరైన రాజ్‌మనీ సింగ్ కూతురు 'సోనాలీ' పేరు పెట్టారు. మేము రూపొందించిన ఈ సోనాలీ-45 రకం కాలీఫ్లవర్ రకానికి డిమాండ్ బాగుందనీ, రుచి కూడా బాగుండటం వలన వాడిన వారంతా లాభ పడ్డారని, ఇటు రైతులు, అటు వినియోగదారులు కూడా ఆనందంగా ఉన్నారని చెప్పటానికి గర్వంగా ఉందని అన్నారు సింగ్ సోదరులు. ఈ ఆనందలో పాలుపంచుకోవాలని మేము కూడా పండించిన కాలీఫ్లవర్‌లు మార్కెట్‌లో స్వయంగా అమ్ముతున్నామన్నారు వారు. తాము పండించేటప్పుడు సేంద్రియ పద్ధతులు ఎక్కువగాను, రసాయన పద్ధతులు అతి తక్కువగాను వాడి పండిస్తున్నామన్నారు. ఇది క్రిమి సంహారక పద్ధతులు, ఎరువుల వాడకంలో కూడా ఇదే పద్ధతి పాటిస్తామన్నారు. వీరు తమ విత్తనాలను 'రామాయణ సీడ్స్' సంస్థ ద్వారా విక్రయిస్తున్నామని, తామింత వరకు తమ స్వంత రాష్ట్రమైన బీహార్ మాత్రమే కాక, ఝార్ఖండ్, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలకు కూడా విక్రయించామని చెప్పారు.

రైతుల కొరకు అధిక దిగుబడితో పాటు, రుచి, తూకం కూడా అధికంగా వచ్చేలా "సోనాలి-45" రకం కాలీఫ్లవర్ ను అభివృద్ధి చేసినందుకు గాను 'ముఖేష్ కుమార్ సింగ్, రాజ్‌మని సింగ్ సోదరులకి ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సం. రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు.

## మీ పరిసరాల్లో ఏ మొక్క ఎక్కడ పెంచాలో మీకు తెలుసా?

**ఇంటి లోపల పెంచుకోవాల్సిన మొక్కలు:**

తులసి (8 రకాలు), మారేడు (బిల్వపత్రం), నేల ఉసిరి, పారిజాతం, కలబంద, కొండపిండి, రణపాల, అశ్వగంధ, పునర్నవ, లక్షణ ఫలం, సరస్వతి, నారింజ, దానిమ్మ, తెల్ల జిల్లేడు, బొప్పాయి, శంఖ పుష్పము, సుగంధపాల, అడ్డసరం, నేలవేము, గోరింటాకు, పత్తి చెట్టు, తిప్పతీగ, బుడ్డ కాయలు, పొడపత్రి, దూసరతీగ, తమలపాకు, నల్లేరు.

**ఇంటి చుట్టూ ఉండాల్సిన చెట్లు:**

మునగ, వేప, నేరేడు, మామిడి, మేడి, పనస, రావి, కొబ్బరి, రేల, కుంకుడు, వొడుగ, ఆముదం, జామ, ముళ్ల గోరింట, సునాముఖి, గంగరావి, గుంట గలగర, ఉసిరి, నిమ్మచెట్టు, కానుగ.

**అందరికీ అందుబాటులో ఉండాల్సినవి:**

ఆరె చెట్టు, ఈశ్వరీ, ఉప్పి, కదంబ, కుక్క పుగాకు, కసింద, వామింటాకు, పిప్పింటాకు, కొదసెపాల, గడ్డి చామంతి, గొలిమిడి వేరు, నల్ల ఉమ్మెత్త, చేదుపుచ్చ, చింతచెట్టు, జమ్మిచెట్టు, తుత్తురు బెండ, తుమ్మిచెట్టు, తెల్లమద్ది, తంగేడు, బ్రహ్మదండి.

**ప్రతి ఊరి చుట్టూ ఉండాల్సినవి:**

మర్రి, జువ్వి, తాటి, ఈతచెట్టు, అవిసె, ఉమ్మెత్త, ఏనుగు పల్లేరు, నేలతంగేడు, గచ్చపొద, ఊడుగ, జుట్టేపు తీగ, తేలుకొండి కాయలు, తుంటేపు, దేవదారు, దర్భ, బ్రహ్మమేడి, మరుల మాతంగి, సేపు ఆకు, మంగ కాయలు, వెలగ, వెంపలి చెట్లు.

**- కొమెర జాజి**, ఫోన్ : 9908411700

# ఆయుర్వేద జ్ఞాన మథనం


ఉమా మహేశ్వర రావు

## 'పళ్ళు, ఆకు కూరలతో' చాలా వరకు ఆరోగ్య సమస్యల నియంత్రణ

**మనం తినే పళ్ళు, కూరగాయలలో ఏ రకమైన విటమిన్లు లభిస్తాయి, వాటిని తీసుకోవటం వల్ల ఏరకమైన ఫలితాలు వస్తాయి, వాటి వల్ల ఎంత వరకు ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా చేసుకోవచ్చు. ఈ విషయాలను అవగాహన కొరకు వీటి గురించి తెలుసుకుందాం.**

**ద్రాక్ష:**

ద్రాక్ష పళ్లు తినటం వల్ల మన శరీరానికి ఎ-1, బి-2, సి విటమిన్లు లభిస్తాయి. కాబట్టి వీటిని తీసుకోవటం వల్ల మలబద్ధకం ఉండదు, కడుపులో మంట ఉండదు, బలహీనత ఉండదు, చర్మం మృదువుగా ఉంటుంది.

**జామ:**

జామ పండు తినటం వల్ల 'సి' విటమిన్ బాగా లభిస్తుంది. దీన్ని తినటం వల్ల మలబద్ధకం ఉండదు, కుష్టు వ్యాధి, చర్మవ్యాధులు ఉన్న వారితో సహా ఎవ్వరైనా జామపండు తినవచ్చు. ఇది చాలా బాగా పని చేస్తుంది.

**నిమ్మ:**

శరీరంలో మలేరియాకు సంబంధించిన క్రిమి కీటకాలున్నా, జ్వరంతో వున్నా, మధుమేహం ఉన్న వారు కూడా నిమ్మరసం వాడటం వల్ల 'సి' విటమిన్ ఇందులో సమృద్ధిగా ఉంటుంది కాబట్టి ఆ బాధల నుంచి విముక్తి కలిగిస్తుంది.

**అరటి పండు:**

అరటి పండులో 'ఏ' విటమిన్ సమృద్ధిగా ఉంటుంది. మూత్ర వ్యాధులకు సంబంధించిన రోగాలున్న వారికి, గర్భిణీ స్త్రీలకు, వారి కడుపులో వున్న బిడ్డకు కూడా ఇది చాలా మంచిది.

**ఉసిరి:**

నరాల బలహీనత, గుండె జబ్బులు ఉన్నవారు, కామెర్లు ఉన్న వారు కూడా ఉసిరి కాయ వాడవచ్చు. చింతపండు కొందరు వాడ కూడదు అంటారు కాబట్టి అటువంటి వారు కూడా చింతపండు బదులు ఉసిరిని ఉపయోగించుకోవటం ద్వారా బాధల నుంచి ఉపశమనం పొందవచ్చు.

**కమలా పండు:**

ఇందులో 'ఎ, బి, సి' విటమిన్లు ఉంటాయి. కాబట్టి వీటిని తినటం వల్ల నిద్ర బాగా పడుతుంది, మలబద్ధకం ఉండదు, జ్వరం వచ్చిన వాళ్ళు, గర్భిణీ స్త్రీలు కూడా వీటిని బాగా తినవచ్చు.

**బొప్పాయి:**

బొప్పాయి పండులో 'ఎ మరియు సి విటమిన్లు' లభిస్తాయి. ఉదర జబ్బులు, మలబద్ధకం, కాలేయం జబ్బులున్న వారికి చాలా మంచిది.

**అనాస (పైన్ ఆపిల్):**

అనాస పండులో 'ఎ, బి-2, సి' విటమిన్లు లభిస్తాయి. ఈ పండు తినటం వల్ల గుండె జబ్బులు ఉన్నవారు, కాలేయం (లివర్) జబ్బులు ఉన్న వాళ్ళకు అనాస పండు మంచి మందులాగా పని చేస్తుంది.

**దానిమ్మ:**

ఇందులో 'బి-2 మరియు సి' విటమిన్లు లభిస్తాయి. నోటిపూత ఉన్నవాళ్ళు, కడుపులో మంట ఉన్న వాళ్ళకి, రక్త హీనత జబ్బు ఉన్న వాళ్ళకి కూడా దానిమ్మ పండు చాలా ఉపకారం చేస్తుంది.

**ఆపిల్:**

ఈ పండులో 'ఎ మరియు సి విటమిన్'లు లభిస్తాయి. వీటిని తినటం వల్ల మలబద్ధకం ఉండదు. చిన్న పిల్లలకు విరోచనాలు పెట్టినట్ల యితే విరోచనాలు తగ్గుముఖం పడతాయి. లివర్ సంబంధిత జబ్బులు ఉన్నవారు కూడా దీన్ని తినవచ్చు. కీళ్ళ నొప్పులు, కొందరు 'గౌట్' వ్యాధి తో బాధ పడ్తుంటారు అటువంటి వారికి ఆపిల్ పండు బాగా పని చేస్తుంది. నరాల బలహీనత ఉన్నవారు, తలనొప్పి ఉన్న వారు, ఉబ్బసం ఉన్నవారు ఆపిల్ పండు ముక్కలను తేనెలో అద్దుకుని తింటే మంచి ఫలితం ఉంటుంది.

**కర్బూజ, పుచ్చకాయ:**

ఇందులో 'బి మరియు ఇ విటమిన్లు' లభిస్తాయి. కర్బూజ తినటం వల్ల కడుపులో మంటలు ఉండవు, మనసు ఆహ్లాదంగా అనిపిస్తుంది. అలాగే పుచ్చకాయలో 'ఎ, సి విటమిన్లు' ఉంటాయి. పుచ్చకాయ తినటం వల్ల కడుపులో మంటలు ఉండవు, మలబద్ధకం, ఎసిడిటీ సమస్య ఉన్నవాళ్ళకు ఈ పండు చాలా బాగా పని చేస్తుంది. దీన్ని తిన్నవాళ్ళకు చాలా త్వరగా అరుగుతుంది. అయితే ఈ పండును సాయంత్రం 4 గంటల లోపు తింటే మంచిది. ఎందుకంటే కొంత మందికి జలుబు చేసే అవకాశం ఉంటుంది. పగటి పూట తిన్నట్లయితే మనిషిపై సూర్యకిరణాల ప్రభావం ఉంటుంది కాబట్టి ఏమీ కాదు.

**కొత్తిమీర:**

కొత్తిమీరను రసం తీసుకుని రెండు మూడు చుక్కల రసాన్ని కళ్ళల్లో వేసుకుంటే కంటికి మంచిది. రక్తహీనత ఉన్నవారు ప్రతి కూరలో కరివేపాకుతో పాటు కొత్తిమీర కూడా తప్పక వేసుకుంటూ ఉన్నట్లయితే 'ఎ' మరియు 'సి' విటమిన్లు లభిస్తాయి.

**తోటకూర:**

ఇందులో 'ఎ' 'బి' మరియు 'సి' విటమిన్‌లు ఉంటాయి. తల వెంట్రుకలకు చాలా మంచిది. జుట్టు రాలే సమస్యను నివారిస్తుంది. చర్మ వ్యాధులున్న వారికి కూడా ఇది చాలా మంచిది. కనీసం వారానికి ఒక్క సారైనా తోటకూర తినటం చాలా మంచిది. ●

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# వేసవి లో వచ్చే అనారోగ్యాలకు వైద్య చిట్కాలు



'వైద్య' కొమెర జాజి

### వేసవిలో కళ్ళ మంటల నుండి కాపాడుకునే చిట్కాలు:

వేసవి కాలంలో ఎన్నో రకాల రుగ్మతలు మనిషిని పీడిస్తూ ఉంటాయి. అలాంటి వాటిలో కళ్ళల్లో మంటలు కొందరికి చాలా ఇబ్బంది పెడతాయి. ఈ వేసవిలో కళ్ళ మంటల నుండి రక్షించుకోవటం కొరకు జీలకర్రను మెత్తడి పొడిగా చేసుకుని ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ఈ పొడిని రోజూ ఒక చెంచాడు పలుచటి మజ్జిగలో కలిపి రోజుకు మూడు సార్లు చొప్పున త్రాగుతూ ఉన్నట్లయితే కళ్ళ మంటల నుండి ఉపశమనం పొందవచ్చు.

కలబంద ఆకును కొద్దిగా తెచ్చుకొని, దానిపైన వున్న చర్మాన్ని తీసివేసి, లోపల ఉన్న కండను కంటి రెప్పల పైన కొద్ది సేపు అలా ఉంచినట్లయితే కూడా కళ్ళ మంటలు త్వరగా తగ్గిపోతాయి. ఇది రోజు మధ్యాహ్నం ఒకసారి, సాయంత్రం ఒకసారి చేస్తే చాలు.

కీర దోసకాయను లేదా టమోట పండును గుండ్రంగా సలాడ్ లాగా కోసుకుని ఆ ముక్కను కంటి రెప్పల పైన అలా ఉంచి కాసేపు విశ్రాంతి తీసుకుంటూ ఉన్నట్లయితే కూడా కండ్ల మంటల నుండి ఉపశమనం పొందవచ్చు.

కీర దోసకాయ ఒకటి తీసుకుని, చిన్న ముక్కలుగా చేసుకుని, ఆ ముక్కలను మిక్సీలో వేసి జ్యూస్ తయారు చేసుకుని, అందులో కొద్దిగా నిమ్మ రసం పిండుకుని రోజుకు ఒకటి రెండుసార్లు చొప్పున తీసుకుంటూ ఉన్నట్లయితే కండ్లలో మంటలు తగ్గి శరీరం కూడా చల్లబడుతుంది.

సుగంధ పాల మొక్క వేర్లు (ఇవి ఆయుర్వేద మూలికలు అమ్మే దుకాణాల్లో లభిస్తాయి) ప్రతిరోజూ రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో నానబెట్టి, ఉదయమే ఆ నీటిని త్రాగినట్లయితే కంట్లో మంటలతో పాటు, శరీరం కూడా చల్లబడుతుంది. వేసవి తాపం నుండి ఉపశమనం పొందవచ్చు.

'దుసర తీగ' దీన్నే 'పాతాళ గరుడ' అని కూడా అంటారు. ఈ తీగ ఆకులు రెండు గుప్పెళ్ళు తీసుకుని ఒక పళ్లెంలో అరగ్లాసు నీటిని తీసుకుని, అందులో ఈ ఆకులను వేసి చేతితోనే మెత్తగా నలిపినట్లయితే ఆ నీరు ఆకుల రసంతో జిగటలాగా తయారు అవుతుంది. తరువాత ఆ ఆకులను తీసివేస్తే, కొద్ది సేపటికే ఆ నీరు గడ్డ కట్టుకు పోతుంది. గడ్డ కట్టిన నీటిలో రుచికోసం కొద్దిగా పటిక బెల్లం కలుపుకుని కడుపు లోకి తీసుకున్నట్లయితే శరీరంలోని వేడి తగ్గటంతో పాటు కండ్ల మంటలు కూడా తగ్గిపోతాయి.

### వేసవిలో తలలోని రుగ్మతలకు చికిత్స:

ఇక వేసవి కాలంలో దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండటం వల్ల అది తల పైన పేరుకు పోయి, తలలో చుండ్రు పట్టి నట్లుగా అనిపిస్తూ ఉంటుంది. అందుకే చాలా మంది ఎండాకాలం ఎక్కువ సార్లు తలస్నానం చేస్తూ ఉంటారు. ఈ తల లోని చుండ్రు నివారణకు మందారం చెట్టు ఆకులు, గోరింటాకు రెండింటినీ ఒక్కో గుప్పెడు చొప్పున తీసుకుని రోట్లో వేసి మెత్తగా దంచి, ఆ మిశ్రమాన్ని తలకు పట్టించి, ఒక అరగంట తర్వాత స్నానం చేసినట్లయితే తలలోని చుండ్రు, వేసవి కాలం వల్ల పట్టే దుమ్ము, పొక్కులు అన్నీ నివారించ బడి తల కూడా బరువు తగ్గినట్లుగా ఉంటుంది.



అంతే కాదు ఒక గరిటెడు పుల్లటి పెరుగు తీసుకుని, అందులో కొద్దిగా నిమ్మరసం పిండుకుని, అందులోనే మందారం చెట్టు ఆకులు గుప్పెడు వేసి, రోట్లో వేసి మెత్తగా దంచిన తర్వాత ఆ మిశ్రమాన్ని తలకు పట్టించుకుని, అరగంట తర్వాత గోరువెచ్చటి నీటితో స్నానం చేసినా కూడా ఇవే ఫలితాలు కనిపిస్తాయి. అయితే తల స్నానం చేసేటపుడు షాంపూ వాడకూడదు. ఆర్గానిక్ శాంపూ లేదా కుంకుడు కాయల రసంతో చేస్తే మంచిది.

గుప్పెడు లేత వేప ఆకులు, గుప్పెడు మందారం చెట్టు ఆకులు, ఒక చెంచాడు మిరియాలు తీసుకుని రోట్లో వేసి మెత్తగా నూరి, వచ్చిన గంధాన్ని తలకు పట్టించి, అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేసిన కూడా పైన చెప్పిన మంచి ఫలితాలు మీరు పొందవచ్చు. పైగా తలలో పేలు ఉన్నా కూడా అవి నశించిపోతాయి.

### మతిమరుపు సమస్య నివారణకు చిట్కా:

రాత్రి పూట సగం లేదా పూర్తి గ్లాసు నీటిని తీసుకుని, అందులో పది తులసి ఆకులను వేసి ఉంచాలి. ఉదయం నిద్ర లేవగానే ముఖం కడుక్కున్న తర్వాత పరగడుపుననే ఈ నీటిని త్రాగి, వీలైతే తులసి ఆకులను కూడా తిన్నా మంచిదే. ఇలా చేస్తూ ఉన్నట్లయితే మతిమరుపు సమస్య చాలా వరకు తగ్గిపోతుంది.

సరస్వతి ఆకులను తీసుకుని నీడలో ఆరబెట్టి బాగా ఎండిన తర్వాత వాటిని పొడి చేసి పెట్టుకోవాలి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం చేతిలో రెండు చెంచాల ఆవు నెయ్యి, ఒక చెంచాడు సరస్వతి ఆకు పొడి వేసుకుని నోట్లో వేసుకుంటూ ఉన్నట్లయితే కూడా మతిమరుపు వ్యాధి త్వరగా నయం అవుతుంది.

ఇంట్లో పెరటి సదుపాయం ఉన్నవాళ్ళు సరస్వతి మరియు తులసి చెట్లను పెంచుకుని ప్రతిరోజూ వాటి వద్దకు వెళ్ళి వాటి సువాసన పీల్చుకుంటూ ఉన్నా కూడా మతిమరుపు వ్యాధి త్వరగా నివారించ బడుతుంది. ●





**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

**బ్రిగేడియర్ గణేశం గారికి,**

వందనాలు. నేను 3 డిశంబరు, 2024 మీ పల్లెసృజన కార్యాలయాన్ని సందర్శించాను. ప్రపంచంలో ఎవరైనా ఇట్లాంటి పని చేశారా? నేను మీతో మాట్లాడుతుంటే శ్వేత బిందువులు రాలుతున్నాయా! అన్న అనుమానం కలిగింది. ప్రపంచమంతా బిగుసుకు పోతుంటే మనిషి మనిషికి దూరం పెరిగిపోతుంటే, సహృదయులు, సత్సంకల్పంతో మీరు చేస్తున్న గ్రామీణ సేవ వెలకట్టలేనిది.

మానవత్వం నశించి పోతుంటే, పునాది స్థాయిలో లాభాపేక్ష లేకుండా నికార్సయిన సమాజ సేవ చేస్తున్న మీరందరూ మహా పురుషులు. నా జీవితంలో అత్యంత విలువైన సమయం మీతో గడిపినదే. నేను 3 డిశంబర్, 2024 నాడు ఎత్తయిన ఎవరెస్ట్ ఎక్కినంత ఆనంద పడ్డాను. ఉన్నత స్థాయి మనసులు కలిస్తే ప్రభుత్వాలు, అధికారులు, రాజులు చేయలేని కార్యాన్ని అతి సులువుగా చేసి నిరూపించారు. దుద్దేకుంట గ్రామంలో మీ బృందాన్ని విహరింప జేయాలని ప్రయత్నిస్తున్నాను.

నేను ఎర్ర నేలలో కూడా రసాయనాలు వేయకుండా ఉలవలు వేశాను. జనవరి 4,5 తేదీల్లో పంట వస్తుంది. అందులో ఉలవ ఒకసారి వేస్తే మరలా పంటలు ఎరువుగా ఉపయోగ పడుతుంది. భూమి చేదెక్కడం వల్ల చీడ వపీడలు తగ్గుతాయి. హస్త కార్తె మొదట్లో వేసినందున గడ్డి కూడా తక్కువయింది.

హంగులు, రంగులు, ఆర్భాటాలు, శబ్దాలు, విద్వేష పోకడల వైపు పోతున్న సమాజాన్ని మాదక ద్రవ్యాలు పట్టి పీడిస్తుంటే, ఎర్రచందనం స్మగ్లర్లను నాయకులుగా చూపించే సినిమాలు, ఆదరించే ప్రపంచము, బట్టలూడదీసిన పోలీసు అధికారులను జ్యూరీ సన్మానించడం జరుగుతోంటే సినిమా దర్శకులకు 'పల్లెసృజన' స్ఫురించలేదా! గణేశం గారూ మిరు రియల్‌టైం హీరో!

సమాజ సేవకు అధికారం, డబ్బులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పోరేట్ ఆఫీసులు అవసరం లేదని నికార్సయిన మార్గాన్ని నిర్మించారు. 19 సంవత్సరాలు నిరాటంకంగా ద్వైమాసిక పత్రిక నడిపారంటే ఎంతో కఠోర శ్రమ ఉందో అర్థం అవుతోంది. నేను, నా కుమారుడు టి. శరత్ కుమార్ పల్లెసృజన కార్యాలయానికి వచ్చినపుడు సుభాష్ గారు మమ్మల్ని ఆహ్వానించి, రెండు రాష్ట్రాల్లో మూల మూలకు తిరిగిన శోధయాత్ర పట్టిక వివరాలను నా కుమారుడు ఫొటో తీసుకున్నాడు. అక్కడున్న హంగు, ఆర్భాటాలు లేని ఆ వాతావరణము నన్ను ఎన్నో విధాలుగా ఆలోచింప జేసింది. ఇన్నోవేటర్లు తయారు చేసిన ఇన్నోవేషన్లు రంగులు, ఆర్భాటాలు లేక ప్రదర్శించ బడ్డాయి. సుభాష్ గారు ఒక్కో పరికరాన్ని విశదీకరించి చెప్తుంటే ఏ దర్శకుడూ పల్లెసృజనకు ఎందుకు రాలేదా అనిపించింది. శోధయాత్ర పట్టికలో అనంతపూర్ జిల్లా లమోని ప్రాంతాలు ఉన్నట్టు గమనించాను. మీరు ఇచ్చిన ప్రదర్శనలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది.

ఏ సమస్యనైనా, ఎన్ని సమస్యలైనా మీలో మీరు చర్చించి, మా సహాయం తీసుకోండని చెప్పడం ఒక గొప్ప ముందడుగు. రాష్ట్ర స్థాణి, దేశ స్థాయి ఫలితాలు గ్రామీణులకు చూపించిన మీరు పుణ్యజీవులు. అట్టడుగు గ్రామాల్లో జ్ఞానముందని గుర్తించడం మీరు ఈ జాతి సంపత్తును పరిచయించినట్టు. వీరరాఘవ రెడ్డి గారు పుస్తకం తయారీలో సిద్ధహస్తుడు. ఎక్కడ కూడా అక్షర దోషం లేకుండా వ్రాయడము గొప్ప తపస్సే! ఈ 19 సంవత్సరాలు 'పల్లెసృజన' నాకెందుకు కనిపించలేదా అనిపించింది. ఇకనుండైనా నన్ను మీ గ్రూపులో చేర్చుకుని నా చిన్న సహాయాన్ని తీసుకోవాలని కోరుకుంటూ..... మీ మిత్రుడు... **– టి. భీమలింగయ్య,** దుద్దేకుంట గ్రామం, బెళుగుప్ప మండలం, అనంతపురం జిల్లా.

**భీమలింగయ్య గారికి,**

మీ అభిమానానికి ధన్యవాదములు. మీరు మా 'పల్లెసృజన' కుటుంబంలో సభ్యుడిగా భావిస్తున్నాము. మీ ప్రాంతంలో పల్లెసృజన ఇనో ఇన్నోవేషన్‌లను విస్తరించే ప్రయత్నం చేయ గలరు. పల్లెసృజన మీకెప్పుడూ తోడుగా ఉంటుంది. **– బ్రిగేడియర్ గణేశం,** పల్లెసృజన

## FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Ranga Reddy Dist |
| 2. Periodicity of its publication | : | Bi-Monthly |
| 3. Printer's Name | : | Narendra Grafix |
| Nationality | : | Indian |
| Address | : | 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. Publisher's Name | : | P. Ganesham |
| Nationality | : | Indian |
| Address | : | P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. Editor's Name | : | P. Ganesham |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : | N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher

పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు

# వంగిన కరెంటు స్తంభాలను సరిచేసే పరికరం

## శ్రమ, ఖర్చు, సమయం అన్నీ తక్కువే

1. ఒకవైపు ఒరిగిపోయిన సిమెంటు కరెంటు స్తంభాలను చక్కగా నిలబెట్టాలంటే ఎంతో శ్రమ, ఖర్చు, సమయం అవసరం.
2. సాధారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 5-6 మంది బలమైన వ్యక్తులు, ఒక ట్రాక్టరు అవసరం, ఒక్క స్తంభం నిలబెట్టడానికి కనీసం 5-6 గంటల సమయం పడుతుంది.
3. ఈ సమస్యకు పరిష్కారంగా కేవలం 1-2 గంటల్లో ఇద్దరు లేదా ముగ్గురు సాధారణ వ్యక్తులు అలుపు లేకుండా స్తంభాన్ని నిటారుగా నిలబెట్టవచ్చు.
4. ట్రాక్టరు అవసరమే లేదు, ఈ పరికరాన్ని కేవలం మోటార్ సైకిల్ పైన ఎక్కడికైనా తీసుకు వెళ్ళవచ్చు.
5. ఈ పనికి అవసరమైన రెండు ప్రత్యేకమైన చిన్న పనిముట్లు కూడా తయారు చేయబడ్డాయి.
6. ఒక్క రోజులో కనీసం 4-5 స్తంభాలను నిటారుగా నిలబెట్టవచ్చు.
7. పంట పొలాల్లో అయినా సరే రైతుకు ఎటువంటి నష్టం వాటిల్ల కుండా పని పూర్తి చేయవచ్చు.
8. విద్యుత్ శాఖకు ఎంతో ఊరట, సమయం, ఖర్చు తక్కువ.
9. విద్యుత్ శాఖకు లక్షలాది రూపాయలను ఆదా చేసే పరికరం.
10. స్తంభాలను త్వరగా సరిచేస్తే ప్రమాదాలు తగ్గుతాయి.






ఇన్నోవేటర్
అల్లాడి ప్రభాకర్
జగిత్యాల జిల్లా
తెలంగాణ





honeybee.org nifindia.org

వివరాలకు సంప్రదించండి

పల్లెసృజన

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org

పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు

# కొబ్బరి బోండాంల ష్రెడ్డర్

## ఉపాధితో పాటు ఊరు పరిశుభ్రం

1. ఒక కొబ్బరి బోండాం భూమిలో కలిసి పోవటానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది.
2. దాని ఉప ఉత్పత్తులతో ఎంతో ఉపయోగం లాభదాయకం.
3. కొబ్బరి బోండాం నుండి లభించే పీచు, కోకోపిత్ వల్ల సమాజానికి ఎన్నో లాభాలు.
4. ఈ యంత్రం తో సులభంగా కొబ్బరి బోండాం నుండి పీచును, కోకోపిత్‌ను వేరు చేయవచ్చు.
5. ఈ యంత్రంలో సింగల్ ఫేస్ మరియు 3 ఫేస్ విద్యుత్‌తో నడిచే 3 హార్స్‌పవర్‌ల మోటారు బిగించబడింది.
6. ఈ యంత్రాన్ని ఉపయోగించడం చాలా సులువు. ఎలాంటి ప్రత్యేకమైన శిక్షణ అవసరం లేదు.
7. ఈ మిషన్ గంటకు సుమారు 200 కొబ్బరి బోండాంలను క్రష్ చేస్తుంది.
8. మీ గ్రామం లేదా పట్టణం శుభ్రంగా ఉండటానికి మీవంతు సహకారం అందించవచ్చు.
9. ఈ యంత్రం ద్వారా చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటు చేసుకొని నలుగురికి ఉపాధి అవకాశం కల్పించవచ్చు.





ఇన్నోవేటర్
అల్లాడి ప్రభాకర్
జగిత్యాల జిల్లా
తెలంగాణ





honeybee.org nifindia.org

వివరాలకు సంప్రదించండి

పల్లెసృజన

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org

PALLE SRUJANA Telugu Bi-monthly January - February 2025 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**
















